# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 25-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:200 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

తీరగు భారతమున గల
మారని ఆధ్యాత్మికతను మన కెరిగింపన్
శ్రీరామ కృష్ణ మఠమును
సారాచారుడు ప్రధాని సందర్శించెన్ !!

(భారత సమాజపు ఆధ్యాత్మికతకు కేంద్రమైన బేలూరు శ్రీరామకృష్ణ మఠాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దర్శించి మఠంలో జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించి అభినందించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

రాష్ట్రాల్లో ప్రాంతీయత
రగులుతున్న అస్తిత్వం
పార్టీలకు శక్తినిచ్చే
పవర్ ఫుల్ జవసత్వం
పోటెత్తిన ఓటు పోల్
పవరెవ్వరికిస్తుందో
డబలింజన్ సర్కారు
దరిదాపుకు వస్తుందో



-వేల్పుల నారాయణ
9440433475

# ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్.. బీజేపీలో చేరనున్న రాఘవ్ చద్దా..

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 24:ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పబోతున్నారు. అంతేకాదు.. బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక్ కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇప్పుడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని ఆప్ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ బహిష్కృత నేత రాఘవ్ చద్దా వెల్లడించారు.

శుక్రవారం రాఘవ్ చద్దా, అశోక్ కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల ఆప్ సభ్యులు కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. అంటే రాజ్యాంగం ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారు. ఇలా ఒక సభలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులు.. అధికార లేదా వేరే ఏ పార్టీలోనైనా చేరవచ్చు. ఇలా చేరితే, పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. దీంతో ఈ ముగ్గురి రాజ్యసభ సభ్యత్వానికి ధోకా లేకపోవచ్చు. ఇక, రాఘవ్ చద్దా, అశోక్, సందీప్.. ముగ్గురూ 2022 నుంచి ఆప్ తరఫున రాజ్యసభలో సభ్యులుగా కొనసాగుతున్నారు. తాజా మీడియా సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ "ఆమ్ ఆద్మీ పార్టీ కోసం 15 ఏళ్లపాటు చెమట, రక్తం చిందించాను. ఇప్పుడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, విలువలు, నైతిక అంశాల నుంచి పూర్తిగా పక్కకు తప్పుకొంది.

ఆమ్ ఆద్మీ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. ఇది చాలా మంది ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇప్పుడు నేను కూడా అదే అనుకుంటున్నా. నేను సరైన పార్టీలో లేనని భావిస్తున్నా. సరైన వ్యక్తిని.. తప్పుడు పార్టీలో ఉన్నా. అందుకే ఈ రోజే ఆమ్ ఆద్మీ పార్టీకి దూరంగా ఉంటున్నా. ప్రజల కోసం వెళ్తున్నా" అంటూ ప్రకటించారు. తమతోపాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సహ్నే కూడా త్వరలో ఆప్‌ను వీడి బీజేపీలో చేరుతారు అంటూ రాఘవ్ వెల్లడించారు. అలాగే, తాను మోదీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయబోతున్నట్లు వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం.. రాఘవ్ చద్దాకు కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# 'ఇంటర్‌నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో జనరల్ ఉపేంద్ర ద్వివేదికి చోటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: భారత సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేది అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. పెన్సిల్వేనియాలోని యుఎస్ ఆర్మీ వార్ కాలేజీకి చెందిన 'ఇంటర్‌నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో ఆయనకు చోటు దక్కింది. ఈ గౌరవాన్ని అందుకున్న మూడవ భారతీయ సైన్యాధ్యక్షుడిగా జనరల్ ఉపేంద్ర ద్వివేది నిలిచారు. గతంలో జనరల్ వీకే సింగ్, జనరల్ విక్రమ్ సింగ్‌లకు ఇంటర్‌నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటుదక్కింది. ఈ విషయాన్ని ఇండియన్ ఆర్మీ ఎక్స్ వేదికగా తెలియజేసింది. ఈ మేరకు శుక్రవారం ఓ పోస్టు పెట్టింది.'జనరల్ ఉపేంద్ర ద్వివేది స్వయంగా ఆ ప్రతిష్ఠాత్మక కళాశాల పూర్వ విద్యార్థి. పర్యటనలో భాగంగా ఆయన కీలక విభాగాలను సందర్శించారు. ప్యానెల్ చర్చల్లో పాల్గొన్నారు. స్కాలర్స్ ప్రోగ్రామ్‌లోని అధునాతన స్టడీ ప్రాజెక్టులను సమీక్షించారు. సంస్థలోని ప్రముఖ సభ్యులతో సంభాషించటంతో పాటు పలు విద్యాపరమైన కార్యక్రమాల్లో పాల్గొన్నారు' అని రాసుకొచ్చింది.

# ఇరాన్‌తో వార్.. 1200 పేట్రియాట్.. 1000 తోమాహాక్స్ వాడిన అమెరికా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఇరాన్‌తో జరిగిన వార్‌లో అమెరికాభారీగా ఖర్చు చేసింది. వైట్‌హౌజ్ అంచనాల ప్రకారం ఆ ఖర్చు సుమారు 28 బిలియన్ల డాలర్ల నుంచి 35 బిలియన్ల డాలర్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. ప్రతి రోజూ అమెరికా ఆ యుద్ధం కోసం సుమారు వంద కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. అయితే యుద్ధం ప్రారంభమైన మొదటి రెండు రోజుల్లోనే అమెరికా దాదాపు 5.6 బిలియన్ల డాలర్ల ఖరీదైన ఆయుధాలను వినియోగించినట్లు తెలుస్తోంది. డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ అంచనాల ప్రకారం అమెరికా సుమారు 1100 జాయింట్ ఎయిర్ టు సర్ఫేస్ మిస్సైళ్లను ఇరాన్ మీదుకు వదలినట్లు తెలుస్తోంది. అమెరికా వద్ద సుమారు 1500 జేఏఎస్ఎస్ఎం-ఈఆర్ క్షిపణులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మిస్సైల్ రేంజ్ దాదాపు 600 కిలోమీటర్లు. శత్రువుల స్థావరాల్లోకి ఇది దూసుకెళ్తుంది. జేఏఎస్ఎస్ఎం మిస్సైల్ ధర ఒక్కటి సుమారు 11 లక్షల డాలర్లు ఉంటుంది.

ఇరాన్‌పై సమరంలో అమెరికా సుమారు 1000 తోమాహాక్ క్రూయిజ్ క్షిపణులు వాడినట్లు తెలుస్తోంది. ప్రతి ఏడాది అమెరికా ఖరీదు చేసే వాటి కంటే పది రెట్లు ఎక్కువగా వాటిని వినియోగించినట్లు అంచనా వేస్తున్నారు. ఒక్కొక్క తోమాహాక్ క్షిపణి ఖరీదు 3.6 మిలియన్ల డాలర్లు ఉంటుంది. తోమాహాక్‌లు లాంగ్ రేంజ్ క్రూయిజ్ మిస్సైళ్లు. 1991లో జరిగిన పర్షియల్ గల్ఫ్ వార్ నుంచి అమెరికా వీటిని వాడుతోంది. అమెరికాకు చెందిన సీఎస్ఐసీ ప్రకారం.. ఆ దేశం వద్ద సుమారు 3000 తోమాహాక్ క్షిపణులు ఉన్నట్లు నిల్వల ద్వారా తెలుస్తోంది. ఈ యుద్ధంలో 1200 పేట్రియాట్ ఇంటర్‌సెప్టార్ క్షిపణులను అమెరికా వినియోగించినట్లు ఓ కథనం ద్వారా తెలిసింది. ఒక్కొక్క పేట్రియాట్ మిస్సైల్ ఖర్చు సుమారు 4 మిలియన్ల డాలర్లు ఉంటుంది. 2025 సంవత్సరంలో అమెరికా దాదాపు 600 పేట్రియాల్ క్షిపణులను ఉత్పత్తి చేసింది.

ఈ వార్‌లో మరో 1000 ప్రిసిషన్ స్ట్రయిక్ క్షిపణులను కూడా అమెరికా వాడింది. వీటిల్లో ఏటీఏసీఎంఎస్ గ్రౌండ్ బేస్డ్ మిస్సైల్స్ కూడా ఉన్నాయి. సీజ్‌ఫైర్ ఒప్పందం జరగకముందే.. యుద్ధం 38 రోజుల పాటు సాగింది. ఈ వార్‌లో అమెరికా 13000 టార్గెట్లను ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది.

# తొలి దశ పోలింగ్‌తోనే మమత జంగిల్ రాజ్‌కు ముగింపు..

## బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోదీ

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 24:పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు."తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్ లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని



టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదు" అని వ్యాఖ్యానించారు.ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యా చారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. "రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం" అని మోదీ అన్నారు.

# హిజ్‌బుల్లాకు ఫైనాన్సింగ్ ఆపితేనే ఇరాన్‌తో శాంతి ఒప్పందం: ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 24: ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై కొత్త షరతు పెట్టారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. సీజ్‌ఫైర్‌ను పర్మనెంట్‌గా కొనసాగించాలంటే హిజ్‌బుల్లాకు ఇరాన్ ఫండింగ్ ఆపాలన్నారు. ఓవల్ ఆఫీసులో ఆయన రిపోర్టర్లతో మాట్లాడారు. ఇరాన్ కచ్చితంగా ఫైనాన్సింగ్ ఆపాలన్నారు. మొన్నటి వరకు ఇరాన్ అణ్వాస్త్ర సామర్థ్యంపై చర్చల్లో ఫోకస్ పెట్టిన ట్రంప్ ఇప్పుడు హిజ్‌బుల్లా వైపు మళ్లారు. ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య త్వరలోనే శాంతి ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నట్లు ఆయన చెప్పారు.

ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ, లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఆవన్.. రాబోయే కొన్ని వారాల్లో వాషింగ్టన్ రానున్నట్లు ట్రంప్ తెలిపారు. వైట్‌హౌజ్‌లో ఇద్దరూ కలుసుకుంటారని ఆయన చెప్పారు. అయితే నెతన్యహూతో లెబనాన్ అధ్యక్షుడు నిజంగా కలుస్తారా లేదా అన్న విషయంపై క్లారిటీ లేదు. ఇక ఇజ్రాయెల్, హిజ్‌బుల్లా మధ్య కాల్పుల విరమణను మరో మూడు వారాలు పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. వైట్‌హౌజ్‌లో రెండు వర్గాలకు చెందిన ప్రతినిధులతో భేటీ అయిన తర్వాత ఆయన ఈ విషయాన్ని చెప్పారు. హిజ్‌బుల్లా, ఇజ్రాయెల్ మధ్య తొలి దశ చర్చలు ఏప్రిల్ 14వ తేదీన జరిగాయి. అయితే ఆ చర్చల తర్వాత 10 రోజుల పాటు సీజ్‌ఫైర్ ప్రకటించారు.

# కల్తీ లేని ఆహారానికి అధిక ప్రాధాన్యత : ప్రముఖ నటుడు సోనూ సూద్




హైదరాబాద్, ఏప్రిల్ 24:కరోనా తరువాత ప్రతి ఒక్కరి ఆలోచనలు మారిపోయాయని, ఆరోగ్యంగా ఉండేందుకు కల్తీ లేని ఆహారం కోసం వెతుకుతున్నారని సినీ నటుడు సోనూ సూద్‌అన్నారు. నాలెడ్జ్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో అశ్య ఫుడ్స్ ఉత్పత్తుల ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, హైకోర్టు జస్టిస్ విజయ్ సేన్‌రెడ్డి, కజికిస్తాన్ గౌరవ డాక్టర్ కౌన్సిల్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ లతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు తాను ముందు నుంచి కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటానని, నాణ్యమైన ఉత్పత్తులు ఉన్నాయంటే దేశంలో ఎక్కడి నుంచైనా తెప్పించుకుంటానని అన్నారు. రైతుల దగ్గరి నుంచి మార్కెట్‌కు వచ్చే సరికి ఆ ఉత్పత్తుల్లో ఎన్నో మార్పులు జరిగి నకిలీగా తయారు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడొద్దని ఆయన కోరారు.

ఈసందర్భంగా అశ్య ఫుడ్స్ అధినేత శశిధర్‌రెడ్డి రూపొందించిన పసుపు, మిరియాలు, కారం, కినోవా తదితర ఆరు రకాల ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ హర్షిత వెలివాల, జాతీయ పసుపు బోర్డు సెక్రటరి, ఐఏఎస్ భవానీ శ్రీ, పద్మశ్రీ మంజుల అనగాని, ఐపీఎస్ రాజీవ్ త్రివేది, ఏఐసీసీ సెక్రటరి సంపత్‌కుమార్, బీఆర్ఎస్ నేత పటోళ్ళ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్ లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి...

**-ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి బాధాకరం..**
**-నగర మేయర్ కొలగని శ్రీనివాస్...**

కరీంనగర్, ఏప్రిల్ 24: (నేటినిజం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్ లో శుక్రవారం రోజున ఆర్టీసీ జేఏసి కార్మికుల కు మద్దతు , సంఘీభావం ప్రకటించి, . ఆర్టీసీ డిపో వద్ద కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు బస్టాండ్ నుండి కార్మికులతో కలిసి అమరవీరుల స్థూపం వరకు మేయర్ కొలగని శ్రీనివాస్ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మేయర్ విచారం వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి కార్మికుల బకాయి ఉన్న వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను పట్టించుకొక పోవడం వల్లే ఆత్మహత్యలు చేస్కోవల్సిన పరిస్తితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు చేస్తున్న న్యాయపోరాటానికి బీజేపి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రబుత్వ మొండి వైఖరి వల్లే నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందడం జరిగిందని... దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రగాడ



సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి డిమాండ్ల నెరవేర్చా లన్నారు. ఆర్టీసీ కార్మికుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త బస్సులను కోనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని.. వెంటనే నడిపిస్తున్న అద్దె బస్సులను తగ్గించాలన్నారు. 30 శాతం ఫిట్ మెంట్ తగ్గకుండా 2021 వేతన సవరణలను వెంటనే చేపట్టి ఆర్టీసీ జేఏసి కార్మికులు తీస్కున్న సమ్మెను విరమింప చేయాలన్నారుఆర్టీసీ జేఏసి ప్రభుత్వం ముందు ఉంచిన 32 న్యాయమైన డిమాండ్ల పై కార్మిక సంఘాలతో సానుకూలంగా చర్చలు జరిపి వాటిని నెరవేర్చే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్టీసి సంస్థలో నూతన రిక్రూట్ మెంట్ చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసే వారికి మద్దతు తెలిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీస్కోవాలన్నారు. గుర్తింపు పొందిన కార్మిక సంఘాల యూనియన్లను వెంటనే ప్రారంబించాలన్నారు. యూనియన్ల ద్వారానే వారి సమస్యలు పరిష్కారం అవుతాయి కాబట్టి... యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి... వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ మొండి వైఖరిని వీడి సమ్మెలో ఉన్న 39 వేల మంది కార్మికులతో తక్షణమే చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా చర్చలు జరపకుండా... సమస్యలను పరిష్కరించ కుండా కార్మికులను బెదింపులకు గురి చేయడం మూర్ఖత్వమని మండి పడ్డారు. ఇప్పటికైన చర్చలు జరిపి... వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని... సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీస్కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చంద్ర, దేవసాని సరస్వతి, మాసం గణేష్, తోట అనిల్ మరియు ఆర్టీసీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం.. భూపాలపల్లిలో పురుగులమందు తాగిన రవీందర్

భూపాలపల్లి ఏప్రిల్ 24: తమ సమస్యల పరిష్కారానికి మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించాడు. భూపాలపల్లి ఆర్టీసీ డిపోనకు చెందిన రవీందర్ అనే డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన తోటి సిబ్బంది అతన్ని వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రతికి తరలించారు.

కాగా, ఆర్టీసీ సమ్మె మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు నలుగురు ఆత్మహత్యాయత్నం చేశారు. నిన్న ఒక్కరోజే నర్సంపేట బస్ స్టాండ్‌లో శంకర్‌గౌడ్.. నల్లగొండ డిపో ఎదుట వెంకన్న.. ఖమ్మంలో లింగారెడ్డి.. ఆత్మహత్యకు యత్నించారు. వీరిలో శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించాడు.

# రైతుపై ఎలుగుబంటి దాడి.. పరిస్థితి విషమం

కామారెడ్డి, ఏప్రిల్ 24: జిల్లాలో ఎలుగుబంటి సంచారం తీవ్ర కలకలం రేపింది. ఓ రైతుపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. రెడ్డిపేట స్కూల్ తండాకు చెందిన సలావత్ మత్తు(45), అతడి భార్య.. కట్టెల కోసం అడవికి వెళ్లారు. ఈ సమయంలో ఒక్కసారిగా మత్తుపై ఎలుగుబంటి దాడి చేసింది. రైతు ముఖంపై బలమైన గాయాలు అయ్యాయి. ఎలుగుబంటిని చూసిన వెంటనే మత్తు భార్య, స్థానికులు కేకలు వేశారు.

దీంతో ఎలుగుబంటి అక్కడి నుంచి అడవిలోకి పారిపోయింది. తీవ్రంగా గాయపడిన మత్తును హుటాహుటిన కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మత్తు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రైతుపై ఎలుగుబంటి దాడి చేసినట్లు స్థానిక సర్పంచ్ వెల్లడించారు.

# మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక...



కరీంనగర్, ఏప్రిల్ 24:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మత్స్యపారిశ్రామిక రామక్రిష్ణకాలనీ గ్రామ మత్స్యపారిశ్రామిక సహకార లి.సంఘం ఎన్నికలను సంబందిత అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి సాజిద్ పేర్కొన్నారు.ఛైర్మన్ గా బోల్ల శంకర్, ఉపాధ్యక్షులుగా రేగుల శ్రీనివాస్,కోశాధికారి గా దాసరి తిరుపతి,డైరెక్టర్లుగా కోతి రాజ్ కుమార్,పండుగ శ్రీనివాస్,గంగు రాయమల్లు,కోతి మల్లేశం,గోనెల పర్శరాములు,గోనెల ఎల్లయ్య లు ఎన్నికైనట్లు తెలిపారు.నూతన కమిటీ సభ్యులకు ముదిరాజ్ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

# పర్యావరణ హితమైన పక్షులు పెంగ్విన్స్

## (25 ఏప్రిల్ “ప్రపంచ పెంగ్విన్ దినోత్సవం” సందర్భంగా)

చూపులకు అందంగా, నలుపు తెలుపుల సమ్మిళిత వర్ణాలతో బొద్దుగా, ముద్దుగా కనిపించే ఎగురలేని అమాయక పెంగ్విన్ జల పక్షుల సంఖ్య రోజు రోజుకు తరుగుతూ అంతరించే అంచున ఉన్నట్లు తాజా అధ్యయనాలు వెల్లడించడం ఒక జీవవైవిధ్య విఘాత హెచ్చరికగా భావించాలి. అన్ని రకాల జీవజాతుల మనుగడతోనే మానవాళి పర్యావరణ హిత ఉజ్వల భవిత ఆధారపడి ఉందని మనకు తెలుసు. పెంగ్విన్ అనబడే నీటిలో నివసించే పక్షులు అధికంగా దక్షిణ అర్ధగోళం(సదరన్ హెమిస్ఫియర్)లో సహజంగా కన్పిస్తాయి. పెంగ్విన్‌లలో దాదాపు 20 రకాల జాతులు ఉన్నాయి. వీటిలో అతి పెద్ద రకాలను ‘ఎంపెరర్ పెంగ్విన్’లుగా, అతి చిన్న జాతి పెంగ్విన్లు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీరప్రాంతాల్లో కనిపిస్తాయి. వీటి సహజ నలుపు తెలుపు వర్ణాలు సముద్ర జలాల్లో వీటిని వేటాడే జీవుల నుంచి కనిపించకుండా (క్యామోఫ్లాజ్) ఉండడానికి దోహదపడతాయి.

### పెంగ్విన్ పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందా !

పక్షుల వర్గంలో ఉన్న పెంగ్విన్‌లు ఎగురలేనప్పటికీ అద్భుతంగా ఏకధాటిగా 60 మైళ్ల వరకు తమ రెక్కల సహాయంతో ఈదడం, 530 మీటర్ల లోతు వరకు డైవింగ్ చేయగలవు. వేగంగా ఈదగల ‘జెండా పెంగ్విన్’లు గంటకు 35 కిమీ దూరం ప్రయాణం చేయగలవు. పెంగ్విన్ పక్షి జాతులను కాపాడుకోవడానికి సామాన్య జనాల్లో అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 25 ఏప్రిల్ రోజున “ప్రపంచ పెంగ్విన్ దినోత్సవం” పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. మానవ కదలికలు లేని ప్రదేశాల్లో స్వేచ్ఛగా జీవించే పెంగ్విన్ పక్షుల మనుగడ కాలక్రమంలో ప్రశ్నార్థకంగా మారుతున్నది. పర్యావరణ కాలుష్యం, భూతాపం, ప్రతికూల వాతావరణ మార్పులు, అతిగా చేపలు పట్టడం, అవి నివసించే ప్రాంతాల్లో మానవ కదలికలు పెరగడం, మానవ అనవసర కదలికలతో పెంగ్విన్ పక్షుల ఉనికి ప్రమాదంలో పడుతున్నది. పర్యావరణ కాలుష్యాన్ని గుర్తించడానికి పెంగ్విన్ పక్షుల విచిత్ర ప్రవర్తనలు గమనించడం జరుగుతుంది.

### పెంగ్విన్ అవగాహన దినం కార్యక్రమాలు:

ప్రపంచ పెంగ్విన్ దినోత్సవం-2026 వేదికగా పెంగ్విన్ పక్షుల గూర్చి వివరాలను తెలుసుకోవడం, వాటి పరిరక్షణకు పటిష్ట కార్యాచరణ రూపొందించి అమలు పరిచే చర్యలను వివరించడం, వాటికి సంబంధించిన వీడియోలను చూడడం, విద్యాలయాల్లో ఈ అరుదైన, అందమైన పక్షుల గూర్చి పోటీలు నిర్వహించడం, సమీప జంతు ప్రదర్శనశాలలకు వెళ్లి పెంగ్విన్ పక్షులను చూసి అబ్బురపడడం, వాతావరణ ప్రతికూల మార్పుల దుష్ప్రభావాలను వివరించడంతో కొనసాగాలి. దశాబ్దాలుగా మానవ తప్పిదాలతో పెంగ్విన్‌ల సంఖ్య గణనీయంగా పడిపోతున్నది.

అరుదైన ఈ జాతి పక్షులను రక్షించేందుకు ప్రతి ఏటా 20 జనవరి రోజున పెంగ్విన్ అవగాహన దినోత్సవాన్ని కూడా నిర్వహించడం జరుగుతున్నది.

ఈ విపరీత ప్రవర్తనలు ఇలాగే కొనసాగితే పెంగ్విన్‌లను ప్రత్యక్షంగా చూడడం మరిచి వీడియోలు, ఫోటోల్లో మాత్రమే చూసి తృప్తిపడే రోజులు రావద్దని, జీవ వైవిధ్య వ్యవస్థలను కాపాడడమే సురక్షిత మానవ మనుగడకు పునాది అని తెలుసుకుందాం, సౌందర్యరాశి అయిన పెంగ్విన్ పక్షులను అక్కున చేర్చుకుందాం.



-మధుపాళీ
9949700037

# దేశ నిర్మాణంలో సానుభూతి, నిజాయితీ, నిబద్ధతతో సేవ చేయాలని పట్టభద్రులకు ఉపరాష్ట్రపతి పిలుపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ లో ఉన్న ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 6వ స్నాతకోత్సవ వేడుకల్లో నేడు భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధకృష్ణన్ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రులవుతున్న విద్యార్థుల జీవితంలో ఇది మార్పు, ఆత్మపరిశీలన, బాధ్యతకు సంబంధించిన కీలకమైన సమయమని అభివర్ణించారు.

రిషికేశ్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. రిషికేశ్ ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక చింతనకు, ప్రశాంతతకు నిలయమని, హిమాలయాలకు ముఖద్వారమని పేర్కొన్న ఉపరాష్ట్రపతి.. ఇలాంటి పవిత్రమైన ప్రదేశంలో ఈ స్నాతకోత్సవ వేడుకలు జరగడం ఈ కార్యక్రమానికి మరింత అర్థాన్ని ఇస్తుందని అన్నారు.

స్నాతకోత్సవం.. కేవలం ఇన్నేళ్ల క్రమశిక్షణతో కూడిన కృషికి, త్యాగానికి లభించిన ముగింపు మాత్రమే కాదనీ, సమాజం, దేశం పట్ల మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయమానికి ఆరంభమని శ్రీ సీపీ రాధ కృష్ణన్ అన్నారు. పట్టభద్రులందరూ వృత్తిపరమైన విధులను అంకితభావంతో, గొప్ప లక్ష్యంతో నిర్వర్తించాలని ఆయన కోరారు.

కోవిడ్-19 మహమ్మారి తీసుకొచ్చిన సవాళ్లను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ పట్టుదలను, ఆవిష్కరణలను, నిబద్ధతను చాటుకుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. దేశంలోని 140 కోట్లకు పైగా పౌరులకు ఉచితంగా వ్యాక్సిన్లను అందించడం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు సమానంగా అందేలా చేసిన భారీ టీకా కార్యక్రమాన్ని కొనియాడారు. భారతీయ శాస్త్రవేత్తలు కేవలం లాభాపేక్ష కోసం కాకుండా, మానవ సంక్షేమం కోసమే టీకాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

100 కంటే ఎక్కువ దేశాలకు టీకాలను సరఫరా చేసిన ‘వ్యాక్సిన్ మైత్రి’ కార్యక్రమం ద్వారా భారత్ తన ప్రపంచ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించిందని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ‘వసుధైక కుటుంబం’ స్ఫూర్తిని ప్రతిబింబించడమే కాకుండా, బాధ్యత కలిగిన ప్రపంచ భాగస్వామిగా భారత్ తన పాత్రను మరింత బలోపేతం చేసిందని అన్నారు.

ఆరోగ్య మౌలిక సదుపాయాల విస్తరణ గురించి వివరిస్తూ.. గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఎయిమ్స్ సంస్థలు... ముఖ్యంగా వెనకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను, వైద్య విద్యను ప్రజలకు చేరువ చేశాయని ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని వారికి సేవ చేయడమే సుపరిపాలనకు అసలైన అర్థమని ఆయన వ్యాఖ్యానించారు.

ఎయిమ్స్ రిషికేశ్ పై ఉపరాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. వైద్య సేవలు, మంచి విద్యాబోధన, పరిశోధన, ఆవిష్కరణ సామాజిక నిబద్ధత కలిగిన ఈ సంస్థ ఒక అద్భుతమైన ప్రదర్శనకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ముఖ్యంగా ఇక్కడి టెలిమెడిసిన్ కార్యక్రమాలను ఆయన అభినందించారు. వైద్య సేవలు కేవలం ఆసుపత్రి ప్రాంగణాలకే పరిమితం కాకుండా, మారుమూల, వెనుకబడిన ప్రజలకు కూడా చేరాలని సూచించారు.

హెలికాప్టర్ ద్వారా అత్యవసర వైద్య సేవలు, చార్ ధామ్ యాత్ర సమయంలో మారుమూల ప్రాంతాలకు మందులను చేరవేసేందుకు డ్రోన్లను ఉపయోగించడం వంటి వినూత్న ఆరోగ్య సేవలను ఉపరాష్ట్రపతి అభినందించారు. వైద్య సేవల రంగంలో దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లకు ఇవి సమర్థవంతమైన పరిష్కారాలని పేర్కొన్నారు.

ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేతో సహా ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధిని ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, వైద్య సేవలను మెరుగుపరచడంలో ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి నాయకత్వంలోని ఉత్తరాఖండ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన అభినందించారు.

వైద్య సేవలు ప్రజల నమ్మకానికి నిదర్శనమని, దేశ నిర్మాణంలో వైద్య నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని శ్రీ సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యలు, వైద్య సేవలు గ్రామాలకూ చేరుకోవడం, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా దేశానికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. సానుభూతి, నిజాయితీ, సేవా దృక్పథం వంటి విలువలతో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ (పదవీ విరమణ), ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ రిషికేశ్ అధ్యక్షులు ప్రొఫెసర్ రాజ్ బహదూర్, డీన్ (అకడమిక్) ప్రొఫెసర్ సౌరభ్, ఎయిమ్స్ కార్యనిర్వాహక డైరెక్టర్ ప్రొఫెసర్ మీను సింగ్, అధ్యాపక బృందం, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## రైలు మార్గాల ఆధునికీకరణ.. వేగవంతమైన, మరింతగా ఆధారపడదగిన నెట్‌వర్క్‌కు దోహదం.. దీనిపై ఓ వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 24:రైలు మార్గాల ఆధునికీకరణ వేగవంతమైన, మరింత ఆధారపడదగిన వ్యవస్థకు ఏ విధంగా దోహదం చేస్తోందీ వివరిస్తూ కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో ఈ రోజు పంచుకున్నారు. రైలు మార్గాలకు కొత్త రూపును ఇవ్వడం, ఆధునిక పరీక్షా విధానం, నిర్వహణ ప్రక్రియలో యంత్రాల సాయాన్ని తీసుకోవడం వంటి చర్యలు రైలు ప్రయాణ నాణ్యతను మెరుగుపరిచి ఇదివరకటితో పోలిస్తే ఎక్కువ వేగంతో రైళ్ల ప్రయాణించగలగడంలో తోడ్పడుతున్నాయని శ్రీ మోదీ వివరించారు. ‘‘ఈ మార్పులు ఆలస్యాలను కుదించి, యాత్రలు సాఫీగా సాగేలా మద్దతివ్వడంతో పాటు దేశవ్యాప్తంగా రోజు రోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల, సరకు రవాణా అవసరాలను తీర్చడంలో రైల్వేలకు సాయపడుతున్నాయి’’ అని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి శ్రీ మోదీ పొందుపరుస్తూ “రైల్వేల ఆధునికీకరణ ప్రక్రియ సత్వర, మరింత విశ్వసనీయ నెట్‌వర్క్‌కు వెన్నుదన్నుగా నిలుస్తోంది. రైలు పట్టాలను సరికొత్తవిగా తీర్చిదిద్దడం, ఆధునిక పరీక్షా విధానాలను అవలంబించడం, నిర్వహణ కార్యకలాపాల్లో యంత్రాల సాయాన్ని తీసుకోవడం రైలు ప్రయాణ నాణ్యతను మెరుగుపరచడంతో పాటు రైళ్లు మునుపటి కన్నా ఎక్కువ వేగంగా పయనించడానికి తోడ్పడుతున్నాయి. ఈ మార్పులు ఆలస్యాలను కుదిస్తున్నాయి. యాత్రలు సాఫీగా సాగేందుకు దోహదపడుతున్నాయి. దేశమంతటా రోజు రోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల, సరకు రవాణా అవసరాలను తీర్చడంలో రైల్వేలకు ఈ మార్పులు సహాయకారిగా ఉంటున్నాయి. కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ రాసిన వ్యాసం చదివి తీరాలి” అని పేర్కొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య-కలెక్టర్ డా॥ ఏ. సిరి



అమరావతి, ఏప్రిల్ 24:‘‘బడి పిలుస్తోంది” కార్యక్రమంలో భాగంగా 6 నుంచి 14 ఏళ్ల పిల్లలందరినీ బడిలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెల్దుర్తి మండలం హరిజనవాడలో జరిగిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ఆమె స్వయంగా పాల్గొన్నారు.

వెల్దుర్తిలోని పలు ఇళ్లకు స్వయంగా వెళ్లిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం మరియు ఉచిత పుస్తకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

వెల్దుర్తి ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన 41 మంది విద్యార్థులు, సమీప ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతిలో చేరడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే అంగన్‌వాడీ పిల్లలను ఒకటో తరగతిలో చేర్పించి, తల్లిదండ్రులకు అడ్మిషన్ పత్రాలను అందజేశారు.

విద్యార్థులు ప్రతిరోజూ డిక్షనరీ చూస్తూ కొత్త ఇంగ్లీష్ పదాలు నేర్చుకోవాలని, కథల పుస్తకాలు చదవాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని, ఎక్కువ నీరు తాగాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని స్థానిక తల్లులు కలెక్టర్ వద్ద హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఎంత బాగా శ్రద్ధ తీసుకుంటే బడిలో పిల్లల సంఖ్య అంత పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుధాకర్, ఎస్ఎస్ఏ పీఓ లోకరాజ్ మరియు ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగ వినియోగదారుల కోసం పీఐ సడలింపు, నగదు తగ్గింపు పథకాన్ని ప్రవేశపెట్టిన భారత్ కోకింగ్ కోల్ సంస్థ

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 24: భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్) 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్ 2026) కాలానికి గాను విద్యుత్ రంగ వినియోగదారుల కోసం పనితీరు ప్రోత్సాహకం (పీఐ) సడలింపు, నగదు తగ్గింపు పథకాన్ని ప్రకటించింది.

ఫ్లెక్సీ-లింకేజ్ పథకం కింద ఉన్న వారితో సహా ఇంధన సరఫరా ఒప్పందాల (ఎఫ్ఎస్ఏ) పరిధిలోకి వచ్చే అర్హతగల విద్యుత్ రంగ వినియోగ దారులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. రైలు, రోడ్డు, ఆర్‌సీఆర్ రవాణా మార్గాల ద్వారా జరిగే వాస్తవ బొగ్గు సేకరణ ఆధారంగా ఈ ప్రోత్సాహకాలు ఉంటాయి. త్రైమాసిక పరిమాణం(క్యూక్యూ) ప్రాతిపదికన వివిధ స్లాబ్‌ల ప్రకారం ఈ పథకం అమలవుతుంది.

ఈ పథకం ద్వారా త్రైమాసిక పరిమాణంలో 120 శాతం కంటే తక్కువ బొగ్గు వినియోగానికి, ప్రస్తుత ఎఫ్ఎస్ఏ నిబంధనల ప్రకారం ముడి బొగ్గుపై మాత్రమే పీఐ వర్తిస్తుంది. ఎటువంటి నగదు తగ్గింపు లభించదు. శుద్ధి చేసిన విద్యుత్ బొగ్గును పీఐ లెక్కింపులో వరిగణనలోకి తీసుకోరు.

త్రైమాసిక పరిమాణం 120 నుంచి 140 శాతం వరకు బొగ్గు సేకరించినప్పుడు.. 90 శాతం కంటే ఎక్కువ సేకరించిన పరిమాణంపై పీఐ వర్తించదు. దీంతోపాటు క్యూక్యూలో 100 శాతం దాటి సేకరించిన బొగ్గుపై 5 శాతం నగదు తగ్గింపు లభిస్తుంది. ఈ నగదు తగ్గింపు నాణ్యత నిర్ధారణకు లోబడి కేవలం ముడి కోకింగ్ బొగ్గు, శుద్ధి చేసిన విద్యుత్ బొగ్గుపై మాత్రమే వర్తిస్తుంది. ఈ రాయితీ మొత్తాన్ని క్రెడిట్ నోట్ల రూపంలో జారీ చేస్తారు. వీటిని భవిష్యత్తులో సరఫరా చేసే బొగ్గు బిల్లుల నుంచి సర్దుబాటు చేసుకోవచ్చు.

ఒకవేళ బొగ్గు సేకరణ క్యూక్యూలో 140 శాతానికి మించితే గతంలో మాదిరిగానే క్యూక్యూలో 90 శాతం దాటిన పరిమాణంపై పీఐ వర్తించదు. 100 శాతం మించి సేకరించిన బొగ్గు పరిమాణంపై 10 శాతం నగదు తగ్గింపు లభిస్తుంది. ఇది కేవలం ముడి కోకింగ్ బొగ్గు, శుద్ధి చేసిన విద్యుత్ బొగ్గుపై మాత్రమే వర్తిస్తుంది.

అర్హులైన వినియోగదారులందరూ తమ బొగ్గు సేకరణను పెంచుకోవాలని, ముఖ్యంగా రైలు మార్గం ద్వారా ఎక్కువ బొగ్గును తీసుకుంటూనే, రోడ్డు, ఆర్‌సీఆర్ మార్గాల ద్వారా కూడా తగినంత సేకరణ జరిగేలా ప్లాన్ చేసుకోవాలని బీసీసీఎల్ సూచించింది. తద్వారా ఈ పథకం కింద గరిష్ట ప్రయోజనాలను పొందవచ్చని తెలిపింది.

# రైతు కళ్లలో ఆనందం చూడటమే మా ధ్యేయం

## -ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

అమరావతి, ఏప్రిల్ 24: తిరువూరు నియోజకవర్గంలోని రైతాంగాన్ని సాగునీటి కష్టాల నుండి గట్టెక్కించే దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. తిరువూరు మండలం గానుగపాడు, జి.కొత్తూరు రైతులకు దశాబ్దాలుగా వరప్రదాయినిగా ఉన్న ‘విప్లవ వాగు సప్లై ఛానెల్’ పునరుద్ధరణ పనులకు శుక్రవారం శుభం పలికారు. పూడిక పేరుకుపోయి, కనీసం నీరు పారలేని స్థితిలో ఉన్న ఈ ఛానెల్ మరమ్మత్తు పనులను స్థానిక శాసనసభ్యులు శ్రీ కొలికపూడి శ్రీనివాసరావు శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి అట్టహాసంగా ప్రారంభించారు.



**పొలాలకు పారనున్న ‘ప్రగతి’ జలాలు**

గత కొన్నేళ్లుగా పూడికతీత పనులు లేక వాగులో నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గింది. దీంతో సాగునీరు రాక పంటలు ఎండిపోయి అల్లాడుతున్న రైతుల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే శ్రీనివాసరావు తక్షణమే స్పందించారు. సుమారు 2.36 లక్షల ప్రత్యేక నిధులను మంజూరు చేయించి పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ‘‘పూడికతీత పనులు పూర్తయితే వాగులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. తద్వారా చివరి ఆయకట్టు రైతుకు కూడా సాగునీరు సమృద్ధిగా అందుతుంది. పంట దిగుబడి పెరిగి, రైతు కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని” ఆకాంక్షించారు.

అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే సంకల్పంతో, నియోజకవర్గంలోని చెరువులు, కాలువలు మరియు సప్లై ఛానెళ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏ ఒక్క ఎకరా కూడా నీరు లేక ఎండిపోకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతల వెల్లువ

ఏళ్ల తరబడి తమను వేధిస్తున్న సాగునీటి సమస్యకు పరిష్కారం చూపి, పనులను స్వయంగా ప్రారంభించిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివా సరావు పై గానుగపాడు, జి.కొత్తూరు గ్రామ రైతులు మరియు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ బాధలను గుర్తించి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే కు గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పండ్ల తోటల పెంపకాలను ప్రోత్సహించండి

అమరావతి, ఏప్రిల్ 24:రైతుకు ఆదాయాన్ని పెంచే విధంగా పండ్ల తోటల పెంపకాలను ప్రోత్సహించాలి ఉరవకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణుడు తెలిపారు. మండలంలోని మోపిడి గ్రామంలో తిరుమల ప్రసాద్ అనే రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా 12 ఎకరాల లో సాగు చేసిన చీని తోటను, ఇతర పంటలను శుక్రవారం ఉరవ కొండ వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణుడు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతు సహాయ కేంద్రసిబ్బంది కలిసి సందర్శించారు.

అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ, ఏవో లు మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం వలన, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందు వలన వర్షాబావ పరిస్థితులను తట్టుకునే విధంగా ప్రకృతి వ్యవసాయం లో మూడు రకాల పద్ధతుల ను ప్రతిపాదించడం జరిగిందన్నారు. పిఎండిఎస్, అర్ధచంద్రాకారం పద్ధతి, వ్యవసాయం నుంచి ఫలసాయ పంటలను సాగు చేయుట పీఎండిఎస్ అనగా రుతు పవనాల కంటే ముందుగానే విత్తనాలను భూమిలో చల్లడం లేదా గొర్రుతో విత్తనం వేయడం ద్వారా వర్షం వచ్చినప్పుడు అవి మొలకెత్తే అవకాశం ఉన్నదన్నారు.



# ఢిల్లీ విమానాశ్రయంలో మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన ఆసక్తిదారులతో ఉన్నత స్థాయి సమావేశం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:ఢిల్లీ విమానాశ్రయంలో హబ్ అండ్ స్పోక్ కార్యకలాపాల అమలుపై పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు ఈ రోజు సమీక్షించారు. ఆయన అధ్యక్షతన విమానయాన రంగానికి చెందిన వివిధ సంస్థలతో విమానాశ్రయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో.. పౌర విమానయాన శాఖ కార్యదర్శితోపాటు హోం శాఖ, పౌర విమానయాన శాఖ, ఇమ్మిగ్రేషన్ బ్యూరో (బీవోఐ), పౌర విమానయాన భద్రతా బ్యూరో (బీసీఏఎస్), కస్టమ్స్, భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ), పౌర విమానయాన డైరెక్టొరేట్ జనరల్ (డీజీసీఏ), సీఐఎస్ఎఫ్, డిజియాత్ర, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్ ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో ప్రయాణికుల రాకపోకల స్థితిగతులను మంత్రి పరిశీలించారు. ఢిల్లీ విమానాశ్రయం టెర్మినల్-3లోని సెక్యూరిటీ హోల్డ్ ఏరియాను కూడా తనిఖీ చేసి, అక్కడి కార్యకలాపాల సన్నద్ధతను సమీక్షించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నేతృత్వంలో జాతీయ పౌర విమానయాన విధానం (ఎన్‌సీఏపీ)-2016ను ప్రభుత్వం రూపొందించింది. 2030 నాటికి భారతీయ ప్రయాణికులకు, అలాగే 2047 నాటికి ప్రపంచానికి భారత్‌ను ఒక అగ్రశ్రేణి వైమానిక కేంద్రంగా నిలపడం లక్ష్యంగా స్పష్టమైన ప్రణాళికను ఈ విధానం సిద్ధం చేసింది. ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో.. అంతర్జాతీయ విమానయాన కేంద్ర వ్యూహాన్ని ప్రభుత్వం రూపొందించింది. దీని కింద పలు కీలక చర్యలు చేపట్టింది. విదేశీ విమానయాన సంస్థలకు పాయింట్స్ ఆఫ్ కాల్‌ల మంజూరులో (ముఖ్యంగా మెట్రోయేతర నగరాల్లో) క్రమబద్ధమైన విధానాన్ని అనుసరించడం, భారతీయ విమానయాన సంస్థలను బలోపేతం చేస్తూ.. దేశీయ వైమానిక కేంద్రాలను ప్రోత్సహించేలా ద్వైపాక్షిక ఒప్పందాలను పునఃసమీక్షించడం, భారతీయ విమానాయాన సంస్థలు తమ అంతర్జాతీయ పరిధిని విస్తరించుకునేందుకు వీలుగా దేశీయ కోడ్-షేర్ ఒప్పందాలను సరళీకరించడం వంటివి ఇందులో ఉన్నాయి.

చర్చల సందర్భంగా మంత్రి శ్రీ రావెమ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. "తూర్పు, పశ్చిమార్ధ గోళాల నడుమ విశిష్టమైన భౌగోళిక స్థానంలో భారత్ ఉంది. అంతర్జాతీయ రవాణా కేంద్రంగా ఎదగడానికి మనకిది సహజసిద్ధమైన సానుకూలతను అందిస్తోంది. భాగస్వామ్య పక్షాలన్నింటితో విస్తృతంగా చర్చించి ఈ వ్యూహాన్ని రూపొందించాం. ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లడంలో క్రియాశీలకమైన మద్దతును అందించిన గౌరవ కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని అన్నారు.

హబ్ అండ్ స్పోక్ నమూనా ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టితో రూపొందించిన 'ఉడాన్' పథకం ద్వారా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో అభివృద్ధి చేసిన విమానాశ్రయాలను.. అంతర్జాతీయ గమ్యస్థానాలతో అనుసంధానించడానికి ఈ విధానం వీలు కల్పిస్తుందన్నారు. దీనివల్ల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, దేశవ్యాప్తంగా ఇప్పటికే అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవడానికి ప్రయాణికులకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

తుది గమ్యస్థానంగా కాకుండా అంతర్జాతీయ రవాణా కేంద్రంగా ఎదిగే దిశగా భారత వైమానిక రంగంలో వస్తున్న మార్పును ఈ హబ్ అండ్ స్పోక్ వ్యూహం స్పష్టం చేస్తోంది. తద్వారా ప్రస్తుతం విదేశీ కేంద్రాల ద్వారా జరుగుతున్న ప్రయాణికుల రాకపోకల్లో గణనీయమైన వాటాను భారతీయ విమానాశ్రయాలు పొందేందుకు అవకాశం లభిస్తుంది.

హబ్‌గా ఎదగాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని స్పష్టం చేస్తూ.. మంత్రి రామ్మోహన్ నాయుడు ఇలా పేర్కొన్నారు: "ప్రస్తుతం భారత్ నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారిలో దాదాపు 35 శాతం మంది దుబాయ్, లండన్, సింగపూర్ వంటి విదేశీ విమానయాన కేంద్రాల మీదుగా ప్రయాణిస్తున్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, కలకత్తా, చెన్నై వంటి భారతీయ ప్రధాన కేంద్రాలను ప్రపంచస్థాయిలో పోటీ పడే విమానయాన కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా ఈ ధోరణిలో పూర్తిగా మార్పును తీసుకురావడమే మా లక్ష్యం"

ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఉదాహరణగా పేర్కొంటూ... "ఏడాదికి 100 మిలియన్లకు పైగా ప్రయాణికుల సామర్థ్యంతో ఢిల్లీ విమానాశ్రయం ప్రత్యేకతను చాటుకుంటోంది. ఉత్తర ప్రాంతంలోని మొత్తం ప్రయాణికుల రాకపోకల్లో దాదాపు 50 శాతం వాటా, అలాగే రోజూ దాదాపు 50,000 ప్రయాణికులతో సహజంగానే అది ఒక 'కేంద్రీయ (హబ్) విమానాశ్రయం'గా నిలుస్తోంది'' అని మంత్రి చెప్పారు.

ప్రయాణికుల సౌకర్యాల తోపాటు.. విమానాల్లో సరుకు రవాణాకు అంతర్జాతీయ కేంద్రంగా భారత్‌ను బలోపేతం చేయడంపై ఈ వ్యూహం ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ఒక విమానం నుంచి మరో విమానానికి మార్చే చేసే సరుకును మళ్లీ మళ్లీ తనిఖీలు చేయాల్సిన అవసరం లేకుండా నిబంధనలను తొలగించడం, కార్గో సంబంధిత అనుమతులు - పత్రాల ప్రక్రియను డిజిటలీకరించడం వంటి చర్యలు.. సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడమే కాకుండా, సరుకు నిర్వహణ సమయాన్నీ తగ్గిస్తాయని భావిస్తున్నారు.

"హబ్ అండ్ స్పోక్ నమూనా ద్వారా ప్రాంతాల మధ్య అనుసంధానం పెరగడమే కాకుండా, దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలనూ కలిగిస్తుంది. దీనివల్ల 2047 నాటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 1.6 ఉద్యోగాలు లభిస్తాయనీ, భారత ఆర్థిక వ్యవస్థకు దాదాపు 1.4 ట్రిలియన్ డాలర్ల మేర ఇది దోహదపడుతుందనీ అంచనా వేస్తున్నాం" అంటూ ఈ నమూనా ప్రాధాన్యాన్ని మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు వివరించారు.

హబ్ అండ్ స్పోక్ నమూనా అమలు ద్వారా విమానయాన సంస్థలు తమ విమానాలను అంతర్జాతీయ కార్యకలాపాల కోసం మరింత సమర్థంగా వినియోగించుకోవడానికి వీలవుతుంది. అలాగే కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలను ప్రాంతీయ కేంద్రాలకు వికేంద్రీకరించడం ద్వారా.. ప్రధాన విమానాశ్రయాల్లో రద్దీని తగ్గించడానికి కూడా ఈ విధానం దోహదపడుతుంది.

సంబంధిత విభాగాల క్రియాశీల భాగస్వామ్యాన్ని మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. భారతీయ విమానయాన సంస్థలు భారీ (వైడ్ బాడీ) విమానాల కోసం గణనీయంగా ఆర్డర్లు ఇవ్వడాన్ని స్వాగతించారు. ఇవి సుదూర ప్రయాణ అనుసంధానాన్ని మెరుగుపరచడం తోపాటు హబ్ కార్యకలాపాలకూ తోడ్పడతాయన్నారు. అదే సమయంలో ప్రయాణికులు వేగంగా, సమర్థంగా విమానాలు మారేందుకు వీలుగా.. స్లాట్ బ్యాంకుల ఏర్పాటు ప్రక్రియను ఢిల్లీ విమానాశ్రయం ప్రారంభించిందని తెలిపారు. డిజియాత్ర వంటి సాంకేతిక మార్గాలను వినియోగించడం ద్వారా.. ముఖ్యంగా దేశీయ, అంతర్జాతీయ విభాగాల మధ్య మారే ప్రయాణికుల రాకపోకలను మరింత క్రమబద్ధీకరించవచ్చని మంత్రి పేర్కొన్నారు.

హబ్ అండ్ స్పోక్ నమూనాలో భాగంగా.. వివిధ చిన్న నగరాల నుంచి వచ్చే ప్రయాణికులను ఒక క్రమబద్ధమైన పద్ధతిలో సమీకరించి, ఢిల్లీ వంటి ప్రధాన హబ్ విమానాశ్రయాల ద్వారా అంతర్జాతీయ ప్రయాణాల కోసం పంపిస్తారు. ఇక్కడి నుంచి బయల్దేరే విమానాల్లో దేశీయ ప్రయాణికులతోపాటు అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారు కూడా ఉంటారు.

ప్రయాణం ప్రారంభించే విమానాశ్రయంలోనే వారికి రెండు వేర్వేరు బోర్డింగ్ పాస్‌లను జారీ చేస్తారు. వీటిపై 'డీ' (దేశీయ), 'ఐ' (అంతర్జాతీయ) అని స్పష్టంగా పేర్కొంటారు. విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలు.. వారు దేశం నుంచి బయటకు వెళ్లే మొదటి పాయింట్ వద్ద, అంటే పరిధీయ (స్పోక్) విమానాశ్రయంలో పూర్తవుతాయి. ఆ ప్రయాణికులకు ప్రయాణ సమయంలో కస్టమ్స్ డిక్లరేషన్ సౌకర్యాలు అందుబాటులో ఉండవు.

దేశంలోకి తిరిగి వచ్చే ప్రయాణికుల విషయానికి వస్తే.. కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలు వారు దేశంలోకి వచ్చిన తుది పాయింట్ వద్ద, అంటే స్పోక్ విమానాశ్రయంలో జరుగుతాయి. ఈ నమూనా ప్రకారం.. లోనికి వచ్చే, బయటికి వెళ్లే అంతర్జాతీయ ప్రయాణికుల లగేజీని కేంద్రీయ (హబ్) విమానాశ్రయంలోని అంతర్గత కార్యకలాపాల (ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్) ద్వారా సజావుగా బదిలీ చేస్తారు. దీంతో ప్రయాణికుల ప్రమేయం అవసరముండదు. కార్యకలాపాల సమర్థత, నిబంధనల్లో స్పష్టత కోసం.. కాంబినేషన్ విమానాలను అనుమతించబోరు. హబ్ అండ్ స్పోక్ కార్యకలాపాల్లో దేశీయ, అంతర్జాతీయ విభాగాల కోసం వేర్వేరు విమానాలను కేటాయిస్తారు. భారతదేశ వ్యూహాత్మక భౌగోళిక ప్రాధాన్యాన్ని, వేగంగా పెరుగుతున్న విమానయాన సామర్థ్యాన్ని గుర్తించిన పౌర విమానయాన మంత్రిత్వ శాఖ.. 2047 నాటికి దేశాన్ని ప్రపంచం లో అగ్రగామి విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది.

## ట్రాఫిక్ రద్దీ తగ్గించి, అనుసంధానాన్ని బలోపేతం దిశగా శరవేగంగా సాగుతున్న డెహ్రాడూన్ బైపాస్ నిర్మాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:డెహ్రాడూన్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రాంతీయ రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలో12 కిలోమీటర్ల పొడవైన, నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ బైపాస్ రోడ్డును నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (భారత జాతీయ రహదారుల సంస్థ) నిర్మిస్తోంది. ఇది ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్‌కు అనుసంధానంగా నిర్మితమవుతోంది. ఈ ప్రాజెక్టు ఝాజ్రా నుంచి ఎన్ హెచ్ 7లోని కొత్త పాంటా సాహిబ్-బల్లుపూర్ సెక్షన్‌ను కలుపుతూ డెహ్రాడూన్ జిల్లాలోని అషారోరి చెక్ పోస్టు సమీపంలోని ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ వద్ద ముగుస్తుంది. సుమారు రూ. 716 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటికే 44 శాతం పూర్తయ్యాయి. ఏప్రిల్ 2027 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

పూర్తిగా నియంత్రిత ప్రవేశంతో వ్యూహాత్మకంగా రూపొందించిన ఈ జాతీయ రహదారి.. డెహ్రాడూన్ నగరంలోకి వెళ్లాల్సిన అవసరం లేని వాహనాలను దారి మళ్లించడానికి ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతుంది. దీనివల్ల ఉత్తరాఖండ్‌లోని సెలాక్వి పారిశ్రామిక ప్రాంతం, వికాస్ నగర్, హెర్బర్ట్‌పూర్, హిమాచల్ ప్రదేశ్‌లోని పాంటా సాహిబ్ వైపు వెళ్లే వాహనాలను నగరం బయట నుంచే నైరుతి వైపుగా వెళ్లిపోవచ్చు. ఫలితంగా డెహ్రాడూన్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యం గణనీయంగా తగ్గుతాయి. అలాగే ఈ కారిడార్ ద్వారా హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు అంతర్రాష్ట్ర రవాణా మెరుగుపడుతుంది.

దీర్ఘకాలిక సుస్థిరతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ రహదారిపై వాహనాల వేగం గంటకు 100 కిలోమీటర్లుగా నిర్ణయించినప్పటికీ, అటవీ ప్రాంతాల్లో అడవులకు నష్టం కలగకుండా కొన్ని చోట్ల వేగాన్ని 80 కిలోమీటర్లకు పరిమితం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం సాధారణంగా ఉండే 60 మీటర్ల రహదారి (రైట్ ఆఫ్ వే) వెడల్పును ఈ ప్రాజెక్టులో 30 మీటర్లకు తగ్గించారు. దీనివల్ల అటవీ చెట్లను నరకాల్సిన అవసరం తగ్గి, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది.

ఈ రహదారి అటవీ ప్రాంతాల గుండా వెళ్తున్నందున, వన్యప్రాణుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పెద్ద జంతువుల స్వేచ్ఛా సంచారం కోసం 350 మీటర్ల పొడవైన వెహిక్యులర్ ఓవర్ పాస్ (వాహనాల వంతెన)తోపాటు పశువుల కోసం ప్రత్యేకంగా క్యాటిల్ ఓవర్ పాస్ ను కూడా నిర్మిస్తున్నారు. వీటితో పాటు 7 చిన్న వంతెనలు, 21 చోట్ల బాక్స్ కల్వర్టులను వన్యప్రాణుల కోసం కేటాయించారు. పాములు, కప్పల వంటి చిన్న జీవుల రాకపోకల కోసం అయిదు ప్రత్యేక హ్యూమ్ పైపు కల్వర్టులను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

భద్రత, పర్యావరణ పరిరక్షణ కోసం రహదారి పొడవునా నిరంతర కంచెను ఏర్పాటు చేస్తున్నారు. వన్యప్రాణుల జోన్లు, వేగ పరిమితులను సూచించే బోర్డులను సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల మనుషులకు, వన్యప్రాణులకు మధ్య ఘర్షణలు తగ్గడంతో పాటు, అటవీ ప్రాంతంలో జంతువులు సురక్షితంగా ప్రయాణించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయి.

## ఉపయోగానికి సిద్ధంగా సుల్తాన్‌పూర్ - పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వే - ఈఎల్ఎఫ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లాలో పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాన్ని (ఈఎల్ఎఫ్) భారత వైమానిక దళం ఉపయోగానికి సిద్ధంగా ఉంది. ఏప్రిల్ 22వ తేదీన ఈ మేరకు అవసరమైన పరీక్షలను నిర్వహించారు.

ఈఏఎఫ్ విమానాల అత్యవసర ల్యాండింగ్ విన్యాసాలను వీక్షించేందుకు యూపీ పంచాయతీ రాజ్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఓం ప్రకాశ్ రాజ్‌భర్, సీఏసీ, ఏఓసీ-ఇన్-సీ ఎయిర్ మార్షల్ బి. మణికంఠన్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

భారత వైమానిక దళ కార్యాచరణ వైవిధ్యాన్ని జగ్వార్, మిరాజ్-2000, సుఖోయ్-30 ఎంకెఐ, సీ-295, ఏఎన్-32 వంటి భిన్న రకాల విమానాలతోపాటు ఎంఐ-17 వీ5 హెలికాప్టర్, గరుడ్ కమాండో బృందాల ద్వారా ప్రదర్శించింది. ఐఏఎఫ్, యూపీఈఐడీఏ, స్థానిక పౌర పరిపాలన విభాగాలతో కలిసి రాత్రింబవళ్లు సాధ్యమైనంత తక్కువ సమయంలో అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా అవసరమైన ప్రామాణిక కార్యాచరణ విధానాలను విజయవంతంగా పరీక్షించింది.

సాధారణ రన్‌వేలు అందుబాటులో లేనప్పుడు కూడా ఆటంకం లేకుండా కార్యకలాపాలను చేపట్టగల ఐఏఎఫ్ సామర్థ్యాన్ని ఈ ఆపరేషన్ భారీగా పెంచింది. దాని కార్యాచరణ స్థితిస్థాపకతను ప్రదర్శించింది. స్వల్ప వ్యవధిలోనే ఇటువంటి ఎక్స్‌ప్రెస్‌వే ఎయిర్‌స్ట్రిప్‌లను అందుబాటులోకి తీసుకురావటంలో వైమానిక సిబ్బంది వృత్తిపరమైన నైపుణ్యాలను, క్షేత్రస్థాయి సిబ్బంది సామర్థ్యాన్ని ఇది నిరూపించింది. జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై వ్యూహాత్మకంగా అభివృద్ధి చేసిన ఈ ఎయిర్‌స్ట్రిప్‌లు అత్యవసర సమయాల్లోనూ కార్యాచరణ సౌలభ్యాన్ని గణనీయంగా పెంచుతాయి. జాతీయ భద్రత, విపత్తు ప్రతిస్పందన సామర్థ్యాలను బలోపేతం చేస్తూ, కీలక బలగాల కోసం ఇవి ఉపయోగపడతాయి.

# తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు

–మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్

అమరావతి, ఏప్రిల్ 24:నంద్యాల నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ సహా సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ? పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో నియోజకవర్గంలోని అర్బన్, రూరల్ ప్రాంతాలు మరియు గోస్పాడు మండలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రధానంగా కే.సీ. కెనాల్‌పై ఆధారపడి ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాలో సమస్యలు ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీ సమన్వయం ఉంటే ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించవచ్చని వారు తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా మున్సిపల్ శాఖ అవసరమైన సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.




పట్టణాభివృద్ధి అంశంపై మంత్రి, కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో అనియంత్రితంగా జరుగుతున్న నిర్మాణాలను నియంత్రించి, క్రమబద్ధమైన అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ సుందరీకరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, అలాగే స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి పట్టణాన్ని శుభ్రతలో ముందంజలో నిలపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పై అసత్య ప్రచారం

–కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్ర

–వేల్పూర్ మండలం టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జైడి నాగధర్ రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 24:ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్ పై అసత్య ఆరోపణలు కాంగ్రెస్ బిజెపి కుట్రతో చేస్తున్నారని వేల్పూర్ మండలం టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జైడి నాగధర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం వేల్పూర్ మండలం ఎమ్మెల్యే నివాసంలోమీడియా సమావేశంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జైడి నాగధర్, రేగుల్ల రాములు మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలను ఈ తీర్పు పూర్తిగా ఖండించిందన్నారు. ఈ తీర్పుతో తెలంగాణ ప్రజలకు, రైతులకు అసలు నిజం తెలిసిందని పేర్కొన్నారు.


కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటి వరకు మొత్తం అయినా ఖర్చు సుమారు రూ.94 వేల కోట్లు అయితే ,లక్ష కోట్ల అవినీతి జరిగిందని దుష్ప్రచారం చేయడం కాంగ్రెస్ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే ఒక్క మెడిగడ్డ బ్యారేజ్ మాత్రమే కాదు అని అందులో 21 పంపు హౌజ్‌లు,15 సబ్ స్టేషన్ లు, రూజర్వాయర్లు, వందల కి. మీ సొరంగాలు,వేల కి.మీ కేనాల్స్, పిల్ల కాలువలు, విజయ వంతంగా కేసీఆర్ నిర్మించారని గుర్తు చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగంగానే ఎస్ఆర్ఎస్పి పునరుజ్జీవం (కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ) ప్రాజెక్ట్ నిర్మించారాని అన్నారు.

ఈ ప్రాజెక్టు వల్లనే ఇటీవల జనవరి,ఫిబ్రవరి నెలల్లో కాకతీయ కాలువ,వరద కాలువల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయిన సందర్భంలో బాల్కొండ,కోరుట్ల,జగిత్యాల ప్రాంతాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడగలిగామని తెలిపారు.బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో రివర్స్ పంపింగ్ ద్వారా రైతులకు నీరు అందించగలిగామని చెప్పారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగమైన రివర్స్ పంపింగ్ లేకుంటే వరద కాలువకు నీళ్లు ఎక్కడ నుండి వచ్చేవో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పగలిగుతారా అని ప్రశ్నించారు.

కేవలం కేసీఆర్ గారిని బద్నాం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగం చేస్తోందని విమర్శించారు. మేడిగడ్డ వద్ద 84 పిల్లర్లలో కేవలం రెండు పిల్లర్లు మాత్రమే కుంగిపోయినప్పటికీ, వాటిని మరమ్మతు చేయకుండా రాజకీయ లబ్ధి కోసం ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటారని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, సత్యం, దయాకర్,రవి, సుంకరి రాములు, దాస్ పాల్గొన్నారు.

## బాటసారుల దాహార్తి తీర్చటం ఆదర్శనీయం


–ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



అమరావతి, ఏప్రిల్ 24:వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చటం ఆదర్శనీయం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం అవనిగడ్డ మండలం పులిగడ్డలో దివిసీమగాంధీ, మానవతావాది, మాజీ మంత్రి వర్యులు స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు సందర్భంగా వారి జ్ఞాపకార్థం ప్రయాణికులు, బాటసారుల కోసం మండలి అభిమానులు నూతన చలివేంద్రం ఏర్పాటు చేశారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చలివేంద్రం ప్రారంభించి, తొలిరోజు సందర్భంగా పానకం పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల వైపు యువత ఆసక్తి చూపటం స్ఫూర్తిదాయకం అన్నారు.

మండలి రామకోటి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గాజుల శంకర రావు, పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకటనాథ ప్రసాద్, టీడీపీ క్లస్టర్ ఇంచార్జి బండే రాఘవ, మోపిదేవి మండల జనసేన అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, దేవస్థానం డైరెక్టర్ కోసూరు అవినాష్, సీనియర్ నేత మండలి రామ్మోహనరావు, నాయకులు భోగాది రాధాకృష్ణ, చెన్ను బాబురావు, అద్దంకి మాధవరావు, నాగిడి రాంబాబు, చెన్ను నాగేంద్రరావు, మండలి శేషగిరిరావు, చెన్ను రాంబాబు, మండలి నాగేశ్వరావు, గుంటూరు పెదబాబు, వర్రే శివాజీ, మేరుగు రవీంద్రబాబు, మండలి వెంకటేశ్వరరావు, మండలి సోమ సుందరరావు, చెన్ను శివాజీ, మండలి సత్యనారాయణ, గుంటూరు వినయ్ బాబు, మండలి భావన్నారాయణ, మిట్ట రమేష్, మండలి సురేష్, పడమటి సాంబశివరావు, బడుగు వెంకటేశ్వరరావు, నాగిడి సుబ్రమణ్యం, భోగాది నాగమల్లేశ్వరావు, జంగం గ్యాబిరెల్, పారేపల్లి అంకాలరావు, ఆరిగ బసవయ్య, పూషడపు మనోహర్, మండలి శ్రీ బలరాం, దుట్టా గోపీచంద్, మండలి శివప్రసాద్, అర్జా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# బోధన్‌లో రూ.100 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్

## -స్థల పరిశీలన చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి




బోధన్, ఏప్రిల్ 24: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్" నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో ఈ అత్యాధునిక పాఠశాల భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

పాఠశాల నిర్మాణానికి సంబంధించి త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. మంచినీటి ఎద్దడిపై సమీక్ష: స్థల పరిశీలన అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, ఆర్డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు, తహసీల్దార్ విఠల్, ఎంపీడీవోలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 24:మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు మాజీ ఎంపీలు బోయిన్ పల్లి వినోద్ కుమార్, మాలోతు కవితలను రఘునాథపల్లి పోలీసులు కోమల్ల టోల్గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నర్సంపేటలో ఆర్టీసీ కార్మికుడు ఆత్మహత్య చేసుకోగా.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళుతున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకొని రఘునాథపల్లి సర్కిల్ కార్యాలయంకు తరలించారు. సీఐ శ్రీనివాస్ రెడ్డితో పాటు నర్మెట సీఐ అబ్బయ్య, స్థానిక ఎస్ఐ డి. నరేష్, పలువురు ఎస్సైలు వారిని అదుపులోకి తీసుకొని ఆఫీసులో ఉంచారు.

# అత్యాధునిక సాంకేతికతలను భారత్‌తో కలిసి అభివృద్ధి చేయండి, కలిసి ఉత్పత్తి చేయండి..

## -రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: అభివృద్ధిలోనూ ఉత్పత్తిలోనూ ఉమ్మడిగా ముందుకు సాగుతూ భారత్‌తో కలిసి నడవాలని, ముఖ్యంగా నైపుణ్యంతో కూడిన అత్యాధునిక సాంకేతికతల రంగంలో భారత్‌తో భాగస్వాములు కావాలని జర్మనీ పారిశ్రామిక రంగాన్ని భారత రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఆహ్వానించారు. విశ్వసనీయత, ఉమ్మడి ప్రయోజనాలు ప్రాతిపదికలుగా భాగస్వామ్యాలను నిర్మించుకోవడం అత్యావశ్యకమన్నారు. భౌగోళిక రాజకీయ సమీకరణాల్లో ప్రస్తుత మార్పులు, సరఫరా వ్యవస్థలో అవాంతరాలు, వేగవంతమైన సాంకేతిక పరిణామాలు, పెరుగుతున్న అంతర్జాతీయ అనిశ్చితుల దృష్ట్యా.. అవి అనివార్యమైనవని వ్యాఖ్యానించారు. ఈ ఐరోపా దేశంలో తన తొలి పర్యటన ముగింపు రోజయిన 2026 ఏప్రిల్ 23న... మ్యూనిచ్‌లో నిర్వహించిన రక్షణ పెట్టుబడిదారుల సదస్సులో భారత్, జర్మనీ రక్షణ రంగ పారిశ్రామిక ప్రముఖులనుద్దేశించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు.

అవసరాల కోసం ఇతరులపై ఆధారపడే విధానాన్ని వివిధ దేశాలు, పరిశ్రమలు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించుకుంటున్నాయని, తమ సరఫరా వ్యవస్థలను విస్తృతం చేసుకుంటున్నాయని రక్షణ మంత్రి అన్నారు. స్థిరత్వం, అవిచ్ఛిన్నత, పరస్పర నమ్మకాన్ని అందించే విశ్వసనీయ భాగస్వాముల కోసం చూస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో... విస్తరిస్తున్న మార్కెట్, నైపుణ్యం కలిగిన యువశక్తి, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక వ్యవస్థలను భారత్ అందిస్తోందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. వీటికి తోడు దేశంలో స్థిరత్వం, అంచనానుకూల విధానాలు, చట్టబద్ధ పాలన వంటి అంశాలు పెట్టుబడిదారులకు భరోసానిస్తాయని వ్యాఖ్యానించారు. అనిశ్చితితో కూడిన ప్రపంచంలో దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయాలకు ఇవే అత్యంత కీలకమైన అంశాలని ఆయన స్పష్టం చేశారు.

రీ-ఆర్మ్ యూరోప్, ఆత్మనిర్భర భారత్ కార్యక్రమాల ద్వారా ఇంకా పూర్తిస్థాయిలో వినియోగించుకోని విస్తృత అవకాశాలను ప్రస్తావిస్తూ... అధునాతన రాడార్ - సెన్సార్ సాంకేతికత, మల్టీ సెన్సార్లు, కృత్రిమ మేధతో పనిచేసే మానవరహిత వైమానిక వ్యవస్థలు, సోనోబోయ్‌లు, అధిక శక్తితో కూడిన తక్కువ పౌనఃపున్యమున్న జలాంతర్గత ట్రాన్స్మిటర్ల వంటి రంగాల్లో జర్మనీ కంపెనీలతో కలిసి ఉమ్మడిగా అభివృద్ధి, ఉత్పత్తుల కోసం భారతీయ కంపెనీలు ఆసక్తితో ఉన్నాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా భారత్ విప్లవాత్మక ప్రస్థానాన్ని రక్షణ మంత్రి వివరించారు. స్పష్టమైన దూరదృష్టి, పటిష్టమైన విధాన నిర్ణయాలు, 140 కోట్ల ప్రజల సమష్టి ఆకాంక్ష ఈ లక్ష్యానికి దన్నుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. "బలమైన స్థూల ఆర్థిక పునాది, స్పష్టమైన విధాన నిర్దేశాలతో ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న, స్థిరమైన ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచింది" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

భారత స్వావలంబన అంతర్ముఖమైనది కాదని, భాగస్వామ్యానికి సరికొత్త బాటలు వేస్తుందని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు. "విశ్వసనీయ భాగస్వాములతో కలిసి భారత్‌లో రూపకల్పన, అభివృద్ధి, ఉత్పత్తి చేయగల సమర్థతగా మేం దేశ స్వావలంబనను పరిగణిస్తున్నాం. భారత్ కేవలం రక్షణ పరికరాల కొనుగోలుదారుగా మాత్రమే కాకుండా.. రూపకల్పన, అభివృద్ధి, ఉత్పత్తిలో భాగస్వామిగా ఎదిగే దిశగా పయనిస్తోంది. ఈ మార్పు ప్రపంచ పరిశ్రమకు కొత్త అవకాశాలను కల్పిస్తుంది. నేటి పరస్పర అనుసంధాన, పరస్పర ఆధారిత ప్రపంచంలో.. భాగస్వామ్యాలు ఐచ్ఛికం కాదు, ఆవశ్యకం. జర్మనీతో భారత సంబంధాలకు పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రయోజనాలు ఆధారం. పరస్పర ప్రయోజనం, ఉమ్మడి వికాసం, దీర్ఘకాలికంగా విలువను పెంచే భాగస్వామ్యమిది" అని ఆయన అన్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో రక్షణ రంగం ప్రాధాన్యాన్ని భారత్ గుర్తించిందన్న రక్షణ మంత్రి... తన పారిశ్రామిక, సాంకేతిక వ్యూహానికి ఈ రంగాన్ని కేంద్రంగా నిలిపిందని పేర్కొన్నారు. "పరిశ్రమ, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థల మధ్య సహకారానికి రక్షణ పారిశ్రామిక వ్యవస్థ ప్రోత్సాహాన్నిస్తుంది. దీంతో అంకుర సంస్థలు ఏర్పాటవడంతోపాటు అత్యాధునిక సాంకేతికతలు అభివృద్ధి చెందుతాయి. సరఫరా వ్యవస్థలు కూడా బలోపేతమవుతాయి. ఈ విధంగా చూస్తే, పటిష్టమైన రక్షణ పారిశ్రామిక పునాదులు.. దేశ భద్రతతోపాటు ఆర్థికంగా బలోపేతమవడానికి, అంతర్జాతీయంగా పోటీపడేందుకు కూడా దోహదపడుతాయి. బలమైన, ఆధునిక, ఆత్మనిర్భర రక్షణ పారిశ్రామిక పునాదులను నిర్మించాలన్నది మా బలమైన ఆకాంక్ష. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, ఆర్థిక భవిత కోసం ఇది అత్యావశ్యకం" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

గత దశాబ్ద కాలంగా వాణిజ్య సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి, పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా భారత్‌ను నిలిపేందుకు ప్రభుత్వం వరుసగా పలు నిర్మాణాత్మక సంస్కరణలను చేపట్టిందని జర్మన్ పారిశ్రామికవేత్తలతో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. "మా విధానాలు పారదర్శకంగా, అంచనానుకూలమైనవిగా, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయి. మేము మా నిబంధనలను సరళీకరించాం. నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేశాం. మౌలిక సదుపాయాలలో భారీగా పెట్టుబడులు పెట్టాం" అని ఆయన వివరించారు.

భారత రక్షణ పారిశ్రామిక రంగాన్ని ప్రస్తావిస్తూ రక్షణ మంత్రి ఇలా అన్నారు: "ఒక మార్కెట్‌గా చూస్తే భారత రక్షణ అవసరాలు విస్తృతమైనవి, వచ్చే దశాబ్దాల్లో ఇవి మరింత పెరుగుతాయి. ఒక తయారీ కేంద్రంగా.. తక్కువ ఖర్చుతో ఉత్పత్తిని, నైపుణ్యం కలిగిన మానవ వనరులను, భారీ సరఫరాదారు వ్యవస్థను మేం అందిస్తున్నాం. ఆవిష్కరణల కేంద్రంగా కొత్త సాంకేతికతలను ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు.. మా అంకుర సంస్థల వ్యవస్థ, ఇంజినీరింగ్ ప్రతిభ, డిజిటల్ సామర్థ్యాలు అనువైన వేదికను అందిస్తున్నాయి. బెంగళూరు, హైదరాబాద్, పూణె వంటి నగరాల్లో వైబ్రంట్ సెంటర్లతో ప్రపంచంలో అతిపెద్ద అంకుర సంస్థల వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఉంది. అంకుర భారత్, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు ఆవిష్కరణలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాయి. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో భాగస్వామిగా.. భారత్‌తో సహకారం వల్ల నష్ట భయం (రిస్క్) తగ్గడమే కాకుండా, క్రియాశీలత పెరుగుతుంది. ఇది కేవలం స్వల్పకాలిక అవకాశం కాదు. ఇదొక దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రతిపాదన."

ముఖ్యమైన పారిశ్రామిక భాగస్వామ్యాల ద్వారా భారత్ - జర్మనీ రక్షణ సంబంధాలు మరింత బలపడడాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ముఖ్యంగా ఉమ్మడి అభివృద్ధి, ఉమ్మడి ఉత్పత్తిపై పెరుగుతున్న ఆసక్తిని ఆయన ప్రస్తావించారు. "మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా.. రక్షణ పరికరాల కోసం పటిష్టమైన సరఫరా వ్యవస్థలను నిర్మించే దిశగా రెండు దేశాలు తమ పరిశ్రమలను సమన్వయం చేస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

జర్మనీతో బలమైన, సుస్థిరమైన భాగస్వామ్యం కోసం భారత్ ఎదురుచూస్తోందని రక్షణ మంత్రి తెలిపారు. భారత్-జర్మనీ భాగస్వామ్యంలోని గత అధ్యాయాలను సాంకేతికత, వాణిజ్యం, సంస్కృతి లిఖిస్తే... ఆవిష్కరణ, సామర్థ్యం, వ్యూహాత్మక సహకారం ద్వారా తదుపరి అధ్యాయాన్ని లిఖించవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.

భారత్, జర్మనీ మధ్య బలపడుతున్న రక్షణ సంబంధాలను చాటేలా.. కీల్‌లోని టీకేఎంఎస్ జలాంతర్గామి నిర్మాణ కేంద్రాన్ని 2026 ఏప్రిల్ 22న శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అధునాతన నౌకాదళ సామర్థ్యాలపై చర్చించుకోవడానికి, భారత రక్షణ ఆధునికీకరణ ప్రాధాన్యాలకు అనుగుణంగా నౌకాదళ సాంకేతికతలో భాగస్వామ్యానికి అవకాశాలను అన్వేషించడానికీ వేదికగా ఈ పర్యటన నిలిచింది.

అంతకుముందు బెర్లిన్‌లో జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్‌తో భారత రక్షణ మంత్రి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ ఐరోపా దేశంతో వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ భేటీ సాగింది. ఈ సమావేశంలో రక్షణ పారిశ్రామిక సహకార ప్రణాళిక, ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక శిక్షణలో సహకారం కోసం ఉద్దేశించిన ఒప్పందాలపై ఇరుదేశాలు సంతకాలు చేసి, పత్రాలను మార్చుకున్నాయి.

# మర్డర్ల కన్న రోడ్డు ప్రమాదాలు పది రేట్లు ఎక్కువ

## -తాగి బండి నడిపితే సీజ్, ఎమ్మెల్యే జి ఎస్ ఆర్



నల్గొండ, ఏప్రిల్ 24: ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం 2026లో భాగంగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో 'అరైవ్ ఆలివ్' ప్రోగ్రాం గ్రామ సర్పంచి నాగమల్లేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ద్విచక్ర వాహనదారులకు 100 హెల్మెట్లను పంపిణీ చేశారు. తద్వారా జిల్లాలోనే 100 శాతం హెల్మెట్ ధారణ గ్రామంగా నిలిచింది. "నో హెల్మెట్ - నో ఎంట్రీ" నినాదంతో ఆదర్శ గ్రామంగా గుంటూరుపల్లి నిలిచింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. "2025 గణాంకాల ప్రకారం మన జిల్లాలో మర్డర్ ల కన్నా రోడ్డు ప్రమాద మరణాల సంఖ్య 10 శాతం పెరిగిందని ఆందోళనకరంగా ఉంద అన్నారు. హెల్మెట్ ధరించకపోవడమే మెజారిటీ మరణాలకు ప్రధాన కారణం. గుంటూరుపల్లి గ్రామం నేడు తీసుకున్న ఈ నిర్ణయం జిల్లా వ్యాప్తంగా మార్పుకు నాంది కావాలి" అని పిలుపునిచ్చారు.

స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాటాడుతూ"హెల్మెట్ ధరించడం కేవలం చట్టం కోసం కాదు, అది మీ కుటుంబానికి ఇచ్చే భద్రత అన్నారు. మద్యం తాగి బైక్ నడిపితే బండి సీజ్ చేయాలని ఆదేశించారు. పార్టీలకు అతీతంగా ఎలాంటి రాజకీయం లేకుండా సహకరించాలన్నారు. గుంటూరుపల్లి గ్రామస్థుల చొరవను చూసి జిల్లాలోని మిగతా గ్రామాలు కూడా స్ఫూర్తి పొందాలిఅని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ సంపత్ రావు , మాట్లాడుతూ, పోలీస్ శాఖ నిరంతరం ప్రజల రక్షణ కోసమే పనిచేస్తుందని, యువత వేగాన్ని నియంత్రించుకొని హెల్మెట్‌ను కవచంగా మార్చుకోవాలని సూచించారు. సీఐ మల్లేష్ మాట్లాడుతూ,ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల ఎన్నో ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు.


### దాతలకు సన్మానం:

ఈ బృహత్తర కార్యక్రమానికి 100 హెల్మెట్లను విరాళంగా అందించిన,పాశం వీరశంకర్, శాకమూరి అమర్, మన్నెం పెద్ద తిరుపతయ్య, మక్కెన అవినాష్, దాతలను ఎస్పీ, ఎమ్మెల్యే లు ఘనంగా సన్మానించారు.

### బైకు ర్యాలీ లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎస్పీ,

కార్యక్రమం అనంతరం గుంటూరుపల్లి నుండి చిట్యాల వరకు బైక్ లపై హెల్మెట్లు ధరించి భారీ ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి ఎస్ ఆర్, ఎస్ పి తాసిల్దార్ వసంత రావు, ఎంపీడీఓ, జయశ్రీ, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్, టేకుమట్ల ఎస్ఐ అమూల్య, మొగుళ్ళపల్లి ఎస్ఐ సురేష్, చిట్యాల ఎస్ఐ-3 ఈశ్వర్యలతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భీమ్‌గల్‌లో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



ఆదిలాబాద్, ఏప్రిల్ 24: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి చెక్కులు ఇస్తూ కొద్దిగా భారాన్ని తగ్గించడం అభినందనీయమని స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొరడి లింబాద్రి, (బద్రి)అన్నారు. భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం స్థానిక కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు అలాగే సర్పంచ్ కొడిగెల శ్రీనివాస్ చేతుల మీదుగా లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డలకు ఆదుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, అలాగే బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రకుమార్, రాష్ట్ర కో- ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,మైనింగ్ శాఖ చైర్మన్ ఈరవత్రి అనిల్ లకు లబ్ధిదారులు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పాలనాధికారి గంగాధర్, పంచాయతీ సెక్రటరీ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి,ఉప సర్పంచ్ బాశెట్టి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు గట్టు మురారి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్ది అవినాష్, కొరడి రాజు, కొరడి లింబాద్రి, రాము, నాయకులు, వార్డ్ మెంబర్ లు వికాస్, మమత, సుమలత,బోల్ట్ రంగారెడ్డి, గిర్ని రాజు, విల్సన్, గంగాధర్ గౌడ్, గంగారెడ్డి ప్రభాకర్, గౌడ్, మంద భూమేష్ రెడ్డి,అశోక్, చిన్న కృష్ణగౌడ్, భాస్కర్, లబ్ధిదారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాదెండ్ల మనోహర్‌ను పరామర్శించిన కేటీఆర్

బ: ఇటీవల మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లి ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చరు

ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీఆర్ఎస్ .ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ రాజు శంభీపూర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నాదెండ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. నాదెండ్ల మనోహర్ గారిని మరియు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆరోగ్యవంతులైన పౌరులే దేశానికి అసలైన సంపద : అడిషనల్ కలెక్టర్ విద్యాచందన

ఖమ్మం, ఏప్రిల్ 24: ఆరోగ్యవంతులైనా పౌరులే దేశానికి అసలైన సంపద అని, మనం తీసుకునే ప్రతి ముద్ద మన ఆరోగ్యానికి పెట్టుబడి కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్యాచందన అన్నారు. శుక్రవారం స్థానిక సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జె.స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే, అక్షరాభ్యాసం, అన్నప్రసన, గర్భిణీలకు శ్రీమంతాలు, జిల్లా స్థాయిలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అత్యున్నత ప్రతిభ కనబరిచిన జిల్లా స్థాయి సీడీపీఓలకు, సూపర్‌వైజర్లకు, పోషణ అభియాన్ సిబ్బందికి, అంగన్‌వాడీ టీచర్లకు మోమెంటో, ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విద్యచందన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

ఈ పోషణ పక్వాడ స్ఫూర్తిని ఈ 15 రోజులే కాకుండా, ఏడాది పొడవునా కొనసాగించే విధంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ రూపొందించి అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదైన లబ్ధిదారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని కోరారు. 2026 పూర్తి అయ్యే నాటికి మన జిల్లా పోషకాహారలోప రహిత జిల్లాగా నిర్మించుకోవాలనే లక్ష్యం పెట్టుకుని క్షేత్రస్థాయిలో సిబ్బంది పని చేయాలని, కేవలం ఆహారం తినడం వేరు, శరీరానికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు అందేలా 'పోషక విలువలు' ఉన్న ఆహారం తీసుకోవడం వేరు అని వివరించారు.

జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా మాట్లాడుతూ.. పోషణ పక్వాడ 2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న 2,061 అంగన్‌వాడీ కేంద్రాలలో నమోదైన లబ్ధిదారులతో పాటు ప్రజలలో కూడా పౌష్టికాహార విలువలపై అవగాహన పెంపొందించినట్లు తెలిపారు.

# పట్టుదలతో చదివి లక్ష్యాలు సాధించాలి

## -ఎంపీడీవో బాలరాజు ప్రిన్సిపాల్ ముఖేష్ కుమార్




నల్గొండ, ఏప్రిల్ 24: గుండాల మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ముఖేష్ కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి గుండాల మండల ఎంపీడీవో దుద్దుకూరు బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో బాలరాజు మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదివి తమ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఆ దిశగా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు వాగులు, కుంటలు, చెరువుల్లో ఈతకు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు వారి నడవడికను నిరంతరం గమనించాలని హెచ్చరించారు.

విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులు పరిశీలించి, మరింత మంచి మార్కులు సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు పొందేందుకు క్రమశిక్షణతో ప్రోత్సహిస్తూ అవసరమైతే ట్యూషన్లు, శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ (ఈఒఔ) కార్యక్రమాల ద్వారా ఆకర్షణీయమైన బోధన పద్ధతులతో విద్యార్థులను తీర్చిదిద్దడంలో కృషి చేస్తున్నారని అభినందించారు. ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలు నేర్పించడం ప్రశంసనీయమని కొనియాడారు.

ఏప్రిల్ 24 నుండి వేసవి సెలవులు ప్రారంభమై జూన్ 13న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈ సుమారు 50 రోజుల సమయంలో తల్లిదండ్రులు పిల్లలను సక్రమంగా మార్గనిర్దేశం చేసి తిరిగి పాఠశాలలకు పంపేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముత్తాపురం కార్యదర్శి బండారి సతీష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం: రాంచందర్ రావు



హైదరాబాద్, ఏప్రిల్ 24: టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ' ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా తీవ్ర అన్యాయం చేస్తుంది. ఆర్టీసీ సమ్మె సమస్యను పరిష్కరించాల్సింది పోయి కమిటీల పేరుతో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన పోరుబాట చివరకు సమ్మెకు దారితీసి.. తద్వారా రాష్ట్రంలో పరిస్థితిని ఆందోళనకరంగా మార్చింది.

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం ఎంతో కలచివేసింది. ముఖ్యంగా ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసిన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించడం అత్యంత బాధాకరం. కాంగ్రెస్ సర్కారు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లతోపాటు వారి సమస్యలు పరిష్కరించక పోవడం వల్లే ఈ దారుణ పరిస్థితి ఎదురైంది. శంకర్ గౌడ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయన కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలి. ఆర్టీసీ కార్మికులు ముందుగానే నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం మాత్రం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరం. బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటూ కార్మికులు సమ్మెకు దిగినప్పుడు, భారతీయ జనతా పార్టీ కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసింది. అదే విధంగా, 2017 నుంచి ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడం కూడా ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి.

దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసిన విషయం తెలిసిందే.

ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి. కార్మికుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. ఆర్టీసీ కార్మికులకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోంది. వారి హక్కుల కోసం మేము పోరాటం కొనసాగిస్తున్నాం.. కొనసాగిస్తూనే ఉంటాం. ఆర్టీసీ కార్మికుల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలుస్తుంది. తెలంగాణ సమాజం మొత్తం కూడా ఈ పోరాటంలో కార్మికుల పక్షానే నిలుస్తోంది. అయితే, ఈ సందర్భంగా నేను ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నాను.. ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దు. మీ సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని' ఆ పార్టీ తెలంగాణ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు.

# భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:భారత్, అమెరికా 2026 ఫిబ్రవరి 7న ఒక సంయుక్త ప్రకటనను జారీ చేశాయి. పరస్పర లాభదాయక వాణిజ్యానికి సంబంధించిన ఒక మధ్యకాలిక ఒప్పంద ప్రణాళికపై ఆ సంయుక్త ప్రకటనలో సమ్మతిని వ్యక్తం చేశాయి. ఈ ప్రణాళిక విస్తృత భారత్, యూఎస్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) సంప్రదింపుల విషయంలో రెండు దేశాల నిబద్ధతను పునరుద్ఘాటించింది. దీని ప్రకారం.. మధ్యకాలిక ఒప్పంద వివరణకు తుది రూపును ఇవ్వడంతో పాటు విస్తృత బీటీఏలో భాగంగా సంప్రదింపులను ముందుకు తీసుకు పోవడానికి యూఎస్‌లో సమాన హోదా కలిగిన వారితో కలిసి ముఖాముఖి సమావేశాల్లో పాల్గొనేందుకు భారతీయ పక్షం వాషింగ్టన్ డీసీని సందర్శించింది. మార్కెట్టు లభ్యత, పన్నుయేతర నిర్ణయాలు, వాణిజ్యంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులు, కస్టమ్స్, వాణిజ్య సౌలభ్యం, పెట్టుబడులకు ప్రోత్సాహం, ఆర్థిక భద్రత దిశగా చర్యలు, డిజిటల్ మాధ్యమ ప్రధాన వాణిజ్యం వంటి అనేక రంగాలపై చర్చించారు. సమావేశాలు ఫలప్రదంగానూ, సానుకూల వాతావరణంలోనూ సాగాయి. ఈ సందర్భంగా అర్థవంతంగానూ, ముందుచూపుతోనూ చర్చలు పూర్తి చేశారు. వీటిలో ప్రధాన అంశాలపై పురోగతి చోటు చేసుకుంది. ఇరు పక్షాలూ ఇక ముందు కూడా ఇదే వేగాన్ని కొనసాగించాలన్న నిబద్ధతను వ్యక్తం చేశాయి.

# మహనీయుల ఆశయాల సాధనలో ముందుకు సాగాలి : ఆచార్య ఇటికాల పురుషోత్తం



నల్గొండ, ఏప్రిల్ 24: మహనీయుల చూపిన ప్రజ్ఞ, కరుణ, పోరాటాల బాటలో ముందుకు సాగాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఇటికాల పురుషోత్తం అన్నారు. శుక్రవారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం, తెలంగాణ ఆర్టీఐ కమిషనర్ శ్రీ దేశాల భూపాల్, ప్రొఫెసర్ మహమ్మద్ అబ్దుల్ మాలిక్ హాజరై త్యాగధనుల సేవలను కొనియాడుతూ విద్యార్థులకు కర్తవ్య బోధ చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ఇటికాల పురుషోత్తం మాట్లాడుతూ.. విద్య ద్వారా సంక్లిష్టతలకు సమాధానాలు, సన్మార్గానికి, సామరస్యతలకు బాటలు వేస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని, విద్యను సాధనంగా భావించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యా ద్వారా పరిపూర్ణమైన మార్పుతో పాటు ప్రపంచాన్ని పరిచయం చేసి ముందుకు నడిపించే సాధనంగా కీర్తించారు. సదాశయంతో మంచి దృక్పథంతో ప్రణాళికతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరు అనడానికి మహనీయుల జీవితాలే సాక్ష్యం అన్నారు. వారి అడుగుజాడల్లో పయనించి దేశాన్ని అభివృద్ధి పదంలో నడపాలని సూచించారు. ప్రజ్ఞ, కరుణ, పోరాటాల బాటలు భావితరాలకు స్ఫూర్తి అన్నారు.

ఆర్టీఐ కమిషనర్ శ్రీ దేశాల భూపాల్ మాట్లాడుతూ.. జీవితంలోని సవాళ్లను స్వీకరించి, నైరాశ్యానికి తావు లేకుండా అంచెలంచలుగా తమను తాను మలుచుకుని కోట్ల మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన పూలే, అంబేద్కర్ మహనీయుల జీవితాలు ఆదర్శమన్నారు. అనంతరం ఆచార్య అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ.. మహనీయుల రచనలు ప్రపంచవ్యాప్తంగా ఎందరో నాయకులను తీర్చిదిద్దాయని, సత్యశోధనకు అధ్యయనమే ఏకైక మార్గమన్నారు. కార్యక్రమంలో కళాకారుడు రేలారే ప్రసాద్ తన పాట మాటతో విద్యార్థులను అలరించారు. రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య సరిత, ఆచార్య అలువాల రవి, డా.రవితేజ, ఆచార్య వసంత, డా.అరుణప్రియ, డా.ప్రేమ్ సాగర్, డా.మద్దిలేటి, డా.జ్యోతి, డా.సబీనా హెరాల్డ్, డా.హరీష్ కుమార్, డా.దోమల రమేష్, డా.మిరియాల రమేష్ పాల్గొన్నారు.

# మెహర్ బాబా పోటీ-3 కి నమోదు ప్రక్రియను ప్రారంభిస్తున్న ఐఏఎఫ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:మెహర్ బాబా పోటీ-3లో భాగంగా మూడో సంచికను భారత వైమానిక దళం ప్రారంభించింది. "సహకారాత్మక డ్రోన్- ఆధారిత నిఘా రాడార్లు'' ఈ పోటీ (ఎమ్‌బీసీ-3) ఇతివృత్తం. ఆధునిక డ్రోన్, రాడార్ సాంకేతికతల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే ఈ పోటీ ముఖ్యోద్దేశం. ఈ పోటీలో పాలుపంచుకొనే ప్రతిభావంతులకు అభివృద్ధి ప్రక్రియకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అందిస్తుంది. మొదటి మూడు స్థానాల్లో నిలిచే విజేతలను పురస్కారాలను ప్రదానం చేసి గౌరవిస్తారు. మెహర్ బాబా పోటీ-3కి నమోదు ప్రక్రియను 2026 ఏప్రిల్ 27న ప్రారంభిస్తారు.

గౌరవ రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేఠ్ 2025 ఏరో ఇండియా సందర్భంగా ఈ పోటీని ప్రకటించారు. మానవ ప్రమేయానికి తావు ఉండని వైమానిక వ్యవస్థల అంతర నిర్వహణీయతపై ఆధారపడ్డ ఒక ప్రారంభిక మోడల్‌ను అభివృద్ధిపరచడం మెహర్ బాబా పోటీ-3 ప్రధానోద్దేశం. ఈ మోడల్.. కఠిన పరిస్థితుల్లో ఏరియల్ టార్గెట్స్‌ను గుర్తించడం, ట్రాకింగ్, రిపోర్టింగ్ విధుల నిర్వహణకు ఒక ఆకాశంలో ఉండే రాడార్‌లాగా పని చేయగలిగి ఉండాలి, అంతేకాదు.. ఏరియల్ టార్గెట్ల ఖచ్చిత స్థితి తాలూకు సమాచారాన్ని ఒక కేంద్రీయ నిఘా స్థావరానికి పంపగలిగేటట్లు కూడా ఈ మోడల్ ఉండాలి. ఈ పోటీలో పాల్గొనాల్సిందిగానూ, తద్వారా ఏరోస్పేస్ రంగంలో తదుపరి నూతన ఆవిష్కరణ పరంపరలో భాగం పంచుకోవాల్సిందిగానూ భారతీయ పరిశ్రమల్నీ, అంకుర సంస్థల్నీ, విద్యాసంస్థల్నీ, పరిశోధక సంస్థల్నీ ఐఏఎఫ్ ఆహ్వానిస్తోంది. ఆసక్తి ఉన్న భాగస్వాములు అధికారిక వెబ్‌సైట్ అందుబాటులో ఉన్న 'విజన్ డాక్యుమెంట్' ను చూసి, ఈ పోటీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

ఈ పోటీకి సంబంధించిన మార్గదర్శక నమూనా ఒక దృఢతర అనుబంధ విస్తారిత వ్యవస్థ (ఇకోసిస్టమ్)ను సఫలతాపూర్వకంగా ప్రోత్సహించింది. మానవ రహిత వ్యవస్థల తయారీ పరిశ్రమకు సుమారు రూ. 2.000 కోట్ల ఆర్డర్లను సంపాదించి పెట్టింది. ఎమ్‌బీసీ ఒకటో సంచికకు "మానవీయ సహాయం, విపత్తు సహాయక కార్యకలాపాలకు ఉద్దేశించిన డ్రోన్ల సమూహం' అంశం ఇతివృత్తంగా ఎంపిక చేయగా, రెండో సంచికకు 'స్మార్మ్ డ్రోన్ బేస్డ్ ఫారిన్ ఆబ్జెక్ట్ డెబ్రి డిటెక్షన్ ఆన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటింగ్ సర్ఫేసెస్'ను ఇతివృత్తంగా నిర్దేశించారు. ఐఏఎఫ్ ఆధ్వర్యంలో ఈ పోటీ పట్ల పరిశ్రమ, అంకుర సంస్థలే కాక విద్యారంగ ప్రముఖులు కూడా ఎంతో ఉత్సాహంతో ప్రతిస్పందించారు. కీలక రక్షణ సంబంధిత సాంకేతికతలపై పని చేయడానికి ఒక ఉమ్మడి వేదికను ఎమ్‌బీసీ అందిస్తూ, భారతీయ పరిశ్రమ, విద్యారంగం, వినియోగదారుల మధ్య అంతరాన్ని భర్తీ చేయడంలో అగ్రగామిగా పేరు తెచ్చుకొంది.

విమానయానానికి సంబంధించిన విశిష్ట సాంకేతికతను దేశీయంగా అభివృద్ధి చేయడాన్ని ప్రోత్సహించడానికి ఐఏఎఫ్ నడుం కట్టి, 'మెహర్ బాబా కాంపిటీషన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ పోటీ.. 2018లో దీనిని మొదలుపెట్టినప్పటి నుంచీ ఎమ్‌బీసీ పరిశ్రమతో పాటు విద్యారంగానికి చెందిన ఎంతో మంది దృష్టిని ఆకర్షించింది. విమానయాన సవాళ్లను ఎదుర్కోవడానికి సముచితమైన నూతన పరిష్కారాల్ని దేశీయంగా అభివృద్ధిపరిచే స్ఫూర్తిని విద్యారంగ ప్రముఖులకూ, అంకుర సంస్థలకూ, పరిశ్రమకూ ఈ పోటీ అందించింది.

చిరకాల అనుభవం కలిగిన, వైమానిక దళ అధికారి మెహర్ సింగ్ డీఎస్ఓ ఎమ్‌వీసీ పేరిట ఎమ్‌బీసీని నిర్వహిస్తున్నారు. ఈయనను ఆప్యాయంగా 'మెహర్ బాబా' అని పిలుచుకుంటారు. ల్యాల్‌పూర్ జిల్లాలో 1915లో పుట్టిన మెహర్ బాబా 1934లో క్రాన్‌వెల్‌లోని రాయల్ ఎయిర్ ఫోర్స్ కాలేజీలో చేరారు. విమానాలను నడపడంలో తనకు ఉన్న నైపుణ్యాన్ని గమనించిన తోటి వైమానికులు ఆయనంటే అమిత గౌరవాన్ని కనబరిచే వారు. 29 ఏళ్ల వయసులో, ఆయన ప్రభావవంత నాయకత్వాన్నీ, ధైర్య సాహసాల్నీ మెచ్చి డిస్టింగ్విష్డ్ సర్వీస్ ఆర్డర్ (డీఎస్ఓ)ను ఆయనకు అందించారు. 1945లో భారతీయ సైన్య తొలి దళాన్ని ఓ డకోటా ఎయిర్‌క్రాఫ్ట్‌లో శ్రీనగర్‌కు తీసుకు వెళ్లిన మిషన్‌కు సారథ్యాన్ని వహించడం ఆయన సాధించిన ఘనతల్లో అత్యంత స్మరణీయమైన ఘనతగా నిలిచింది. అప్పట్లో ప్రపంచంలో అతి ఎత్తయిన ఎయిర్‌స్ట్రిప్.. లే.ప్రాంతానికి విమానంలో వెళ్లిన ఘనత కూడా మెహర్ బాబా పేరిటే నమోదైంది. భారత వైమానిక దళంలో మొదటి మహావీర్ చక్ర పురస్కారాన్ని పొందింది కూడా మెహర్ బాబాయే.

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి : సీఐటీయూ

## -సమ్మెకు సంపూర్ణ మద్దతు

ఖమ్మం, ఏప్రిల్ 24: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు ఖమ్మం జిల్లా ఆల్ ఆటోమొబైల్ షోరూమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. శుక్రవారం రోజు వరంగల్ క్రాస్ రోడ్డు కార్ల షోరూం దగ్గర జిల్లా కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ జేడ్పీటిసి సభ్యులు పెరుమాళ్ళపల్లి మోహన్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పంతాలకు పోకుండా కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలన్నారు.

ఇప్పటికే రాష్ట్రంలో ఇద్దరు కార్మికులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు వెళ్లకుండా ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఇప్పటికే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న అన్ని ఆటో మొబైల్ షోరూమ్స్ దగ్గర మే డే జెండాలు ఎగురవేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బీమనపల్లి నాగ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బూసిపోగు వెంకటేశ్వరరావు, కోశాధికారి ప్రవీణ్ కుమార్, ప్రకాష్, గుగ్గిల వీరబాబు, శ్రీకాంత్, నరేష్, గోవర్ధన్, వసంత బాబు, గోపినాథ్, శేఖర్ పాల్గొన్నారు.

# 'ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీకి ఇంకా 6 రోజులే గడువు'

## - నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర



నల్గొండ, ఏప్రిల్ 24:నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ పొందేందుకు కేవలం 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర కోరారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు తమ ప్రాపర్టీ పన్ను బకాయిలను (జీతీతీవజీతీబ) పూర్తిగా చెల్లించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును తక్షణమే చెల్లించి, రాయితీ ప్రయోజనాన్ని పొందాలిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా నగర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి కాల్వల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పన్నుల వసూలు కీలకమని తెలిపారు. పౌరులందరూ ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు వాటర్ ట్యాక్స్ అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించాల్సిందిగా కోరారు. ప్రజల సహకారం లేకుండా నగర అభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం ద్వారా నల్లగొండను మరింత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. పౌరులందరూ చివరి తేదీకి ముందుగానే తమ పన్నులను చెల్లించి, ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీని వినియోగించుకోవడంతో పాటు, నగరాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాల్సిందిగా కమిషనర్ కోరారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి

నల్గొండ, ఏప్రిల్ 24: మునుగోడు మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ పాలకూరి రమాదేవి శుక్రవారం ఉదయం సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై ఇబ్బందులను రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని, రైతులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని సంబంధిత అధికారులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ క్రమంలో మునుగోడుకు వచ్చిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కు ధాన్యం కొనుగోళ్ల ఇబ్బందులపై సర్పంచ్ పాలకూరి రమాదేవి వివరించారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.

స్పందించిన కలెక్టర్ వాహనాలను ఎక్కువగా ఏర్పాటు చేసి నిర్లక్ష్యం చేయకుండా కొనుగోలు వేగవంతం మునుగోడులో కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రం ఏర్పాటుకు భవనాన్ని గుర్తించడాన్ని కలెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. కుక్క కాటు ఘటనలు పెరిగిపోతుండడంతో వీధి కుక్కల సంతతిని తగ్గించే ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుందని, కుక్కలను పట్టుకునే బృందాలను ఏర్పాటు చేసి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సదర్భంగా కలెక్టర్ తెలిపారు.

# మాదక ద్రవ్యాల డిమాండును తగ్గించే జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్ఏపీడీడీఆర్)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించే లక్ష్యంతో సామాజిక న్యాయం, సాధికారత శాఖ 2020 ఆగస్టు 15న అత్యంత ప్రభావితమైన 272 జిల్లాల్లో 'నషా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎంబీఏ)ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం సాధించిన విజయంతో 2023 ఆగస్టు 15 నుంచి దీనిని దేశంలోని అన్ని జిల్లాలకు విస్తరించారు. సామాన్యుల్లో మత్తు పదార్థాల వాడకం పట్ల చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విద్యాసంస్థలతో సహా వివిధ స్థాయిల్లో నిర్వహించిన 8.3 లక్షలకు పైగా కార్యక్రమాల ద్వారా సుమారు 26 కోట్ల మందికి పైగా ప్రజల్లో చైతన్యం తెచ్చారు. ఈ కార్యక్రమంలో 9.5 కోట్లకు పైగా యువత, 6.47 కోట్ల మంది మహిళలు, 28,000 మందికి పైగా మాస్టర్ వాలంటీర్లు భాగస్వాములు కావడం విశేషం.

మాదకద్రవ్యాల డిమాండును తగ్గించే జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్ఏపీడీడీఆర్) పర్యవేక్షణ, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ప్రస్తుతం నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) యాప్ 2.0ను ఆవిష్కరించనుంది. ఈ ఆధునిక అప్లికేషన్ కేంద్ర, రాష్ట్ర, జిల్లా, సంస్థాగత స్థాయిల్లో అమలు చేసే సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడానికి, ఎప్పటికప్పుడు నివేదికలను పంపించేందుకు, పర్యవేక్షించడానికి రాష్ట్రాలు, జిల్లాలకు ఒక కేంద్రీకృత డిజిటల్ సాధనంగా ఉపయోగపడుతుంది. ఈ కొత్త వెర్షన్ ఇప్పటికే ఉన్న సౌకర్యాలను కొనసాగిస్తూనే.. పారదర్శకతను, జవాబుదారీతనాన్ని, డేటా ఆధారిత పాలనను పెంపొందించే లక్ష్యంతో సరికొత్త ఫీచర్లను పరిచయం చేస్తుంది.


ప్రస్తుతం అధికారిక వినియోగదారులకు అందుబాటులో ఉన్న ఎన్ఎంబీఏ యాప్ రాష్ట్రాలు, జిల్లాలు, ఆధ్యాత్మిక సంస్థలు, ఇతర భాగస్వాములకు 'నషా ముక్త్ భారత్ అభియాన్' కింద తాము చేపట్టిన కార్యకలాపాలను అప్‌లోడ్ చేయడానికి సహాయపడుతుంది. అలాగే ఒక కేంద్రీకృత డ్యాష్‌బోర్డు ద్వారా వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి తోడ్పడుతుంది. ఇది సమాచార, విద్యా, ప్రసార సమాచారాన్ని అందించడమే కాకుండా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనే 'నషా ముక్తి మిత్ర'లకు అవసరమైన ప్రాథమిక కమ్యూనికేషన్ మద్దతును కూడా అందిస్తుంది. ఈ యాప్‌లో మాస్టర్ వాలంటీర్లను (నషా ముక్తి మిత్ర) చేర్చుకోవడం, సమన్వయం చేయడం కోసం సులభమైన వ్యవస్థ ఉంది. విద్యాసంస్థలు, ఇతర సంస్థలు తమ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ప్రతిజ్ఞా కార్యక్రమాలను నిర్వహించడానికి కూడా ఇది వీలు కల్పిస్తుంది. మత్తు పదార్థాల విముక్తి కోసం హెల్ప్‌లైన్, మానస్ హెల్ప్‌లైన్ వంటి ముఖ్యమైన నంబర్ల ద్వారా మానసిక ఆరోగ్య సేవలతోపాటు ప్రాథమిక సాంకేతిక సహాయాన్ని ఈ యాప్ అందిస్తుంది సహాయం పొందే సంస్థలు (జీఐఏ) కూడా ఇప్పుడు ఈ వేదికలో చేరవచ్చు. వీరు తమ కేంద్రాల్లో జరుగుతున్న కార్యకలాపాలను ఎప్పటికప్పుడు నివేదించడానికి, పర్యవేక్షించడానికి ప్రత్యేక లాగిన్ సౌకర్యం ఉంటుంది. ఈ యాప్ ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే సంస్థల నిధుల వివరాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సదరు సంస్థలకు సామాజిక న్యాయం, సాధికారత శాఖ అందుబాటులో ఉంచుతుంది.

# సామాజిక న్యాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు), వృద్ధులు, మద్యపానం - మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారు, ట్రాన్స్‌జెండర్లు, యాచకులు, విముక్త - సంచార తెగలు (డీఎన్‌టీలు), మాన్యువల్ స్కావెంజర్లు, పారిశుద్ధ్య కార్మికులు (చెత్త ఏరుకునే వారు సహా), ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) అభ్యున్నతి కోసం ఉద్దేశించిన వివిధ చట్టాలు, సంక్షేమ పథకాల అమలును సామాజిక న్యాయం, సాధికారతా శాఖ పర్యవేక్షిస్తుంది. నిర్దేశిత చర్యలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు సమ్మిళిత అభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతా శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అన్నారు.

షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల విద్యాసాధికారతపై దృష్టి సారిస్తూ అనేక పథకాలను ఈ శాఖ అమలు చేస్తోంది. 2025-26లో 75 లక్షలకు పైగా ఎస్సీ లబ్ధిదారులకు రూ. 7,981.47 కోట్ల నిధులను పంపిణీ చేసింది.

ఎస్సీల కోసం చేపట్టిన సంక్షేమ పథకాల కింద చేసే ఖర్చు స్థిరమైన వృద్ధిని, సానుకూల ధోరణిని కనబరుస్తోంది. 2024?25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. ఎస్సీలు, ఇతర వర్గాల కోసం ఉద్దేశించిన ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకంలో 21 శాతం, ఎస్సీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకంలో 11.23 శాతం, ఎస్సీ విద్యార్థుల కోసం ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకమైన టాప్ క్లాస్ ఎడ్యుకేషన్‌లో 13.5 శాతం, నిర్దేశిత ప్రాంతాల్లోని హైస్కూళ్ల విద్యార్థులకు ఆవాస విద్య (శ్రేష్ఠ) పథకం కింద 16 శాతం వృద్ధిని గమనించవచ్చు.

# రేడియో ఆవిష్కర్త మార్కొనీ

గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ (1874 ఏప్రిల్ 25 - 1937 జూలై 20) ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితామహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్ తో కలసి వైర్‌లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్‌లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు.

రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి.

మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు.


లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు. 18 యేళ్ళ వయస్సులో అతను తిగిరి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు.

1890 ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం.

బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగల వచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు.

ఒకరోజు అర్థరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది.

మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు.



ఏప్రిల్ 25...
గుగ్లి ఎల్మో మార్కొని జయంతి

క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యుడయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే.

వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసుకోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా సాయం సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది.

1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు.

మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం (broad casting station) పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభమైనాయి.

1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు. 1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది.

బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది.

1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

## సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువలో సేవలు

- ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే ప్రాణాలు కాపాడగలం
- వేములవాడలో కొత్త పోలీస్ స్టేషన్లకు కృషి చేస్తాం
- డీజీపీ బీ శివధర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని డీజీపీ బీ శివధర్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో ఎకరం స్థలంలో నిర్మించనున్న ఆధునిక పోలీస్ స్టేషన్ భవనానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని డీజీపీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. ప్రమాదాల వల్లే ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోందని పేర్కొన్నారు. అరైవ్.. అలైవ్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వేములవాడకు మరిన్ని పోలీస్ స్టేషన్లువేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్లు మంజూరుకు కృషి చేస్తానని



తెలిపారు. భీమారంలో కూడా పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మెరుగైన సేవలకు నూతన భవనంకలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కొత్త పోలీస్ స్టేషన్ నిర్మాణంతో ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. రోడ్డు భద్రత అందరి బాధ్యతఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ జిల్లాలో నో హెల్మెట్?నో ఎంట్రీ అమలు చేస్తున్నామని తెలిపారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు, సీపీఆర్ శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక తిరుపతి, ఏ ఎస్పి చంద్రయ్య, ఆర్డీఓ రాధా భాయ్, డి.ఎస్.పి శ్రీనివాసులు, తహసిల్దార్లు పుష్పలత, జయంత్ కుమార్, సీఐ వెంకటేశ్వర్, ఎస్సైలు, సర్పంచ్ ల కో్మ నా రా య ం ణ , ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 'ఉచిత వైద్య సేవలు అభినందనీయం'

- మున్సిపల్ చైర్మన్ ఏర్నేని కుసుమ వెంకటరత్నం బాబు

నల్గొండ, ఏప్రిల్ 24:నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని లక్ష్మీపురం కాలనీ 1వ వార్డులో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లీశ్వరి, స్థానిక కౌన్సిలర్ సామినేని రజని, నరేష్ లతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. యశోద ఆసుపత్రి వైద్యులు 300 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించగా, సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారిని సూర్యాపేటకు తీసుకువెళ్లారు.

ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందించడం గొప్ప విషయమని అందుకుగాను ఎంతో సేవ చేస్తున్న స్థానిక కౌన్సిలర్ సామినేని రజని, నరేష్, ట్రస్ట్ సభ్యులను కొనియాడారు. ఈ సందర్భంగా వైద్యులను శాలువాతో ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల ప్రవీణ, రాజశేఖర్,ఓరుగంటి కిట్టు, దేవరశెట్టి వెంకటేశ్వరరావు, కాలంగి వెంకటేశ్వర్లు, కందిబండ నాగేశ్వరరావు, వంకాయల ప్రసాద్, గుడుగుంట్ల సాయి, వెంపటి ప్రసాద్, వంకాయల స్వాతి, వంగవీటి రామారావు, వెంపటి వెంకటరమణ పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో డీజీపీ ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24:(నేటినిజం ప్రతినిధి): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు. తరువాత స్వామివారి మండపంలో అర్చకులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం, చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కేబినెట్ నిర్ణయాన్ని అమలు చేయండి



హన్మకొండ, ఏప్రిల్ 24: రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలు, బెనిఫిట్స్-చెల్లింపుల విషయంలో క్యాబినెట్ సమావేశంలో 2024 నుంచి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను విడుదల చేయడానికి, రాబోయే వంద రోజుల్లోగా రూ.6,200 కోట్ల బకాయిలు చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఇన్నాళ్లు ఆలస్యమైనా ఎలాంటి వాయిదాలు వేయకుండా రిటైర్మెంట్ బెనిఫి ట్స్ ఏక మొత్తంలో చెల్లించి కేబినెట్ నిర్ణయాన్ని అమలు పరచాలని రిటైర్మెంట్ బకాయిల సాధన కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ శ్రీధర్ల ధర్మేంద్ర, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హనుమకొండ జడ్పీలోని పీఆర్టీయూ భవనంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మార్చి 2024 నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెన్ఫిట్స్ అందక అనేక కుటుంబాలు రోడ్ల మీద పడ్డా యని, గత అక్టోబర్ 25 నుండి నేటి వరకు 91 మంది రిటైర్డ్ ఉద్యోగులు చనిపోయారన్నారు. చివరికి ఉద్యోగ జేఏసీ కూడా ఉద్యమించడంతో రిటైర్డ్ ఉద్యోగుల బాధలను ప్రభుత్వం గుర్తించి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు 100 రోజుల్లో చెల్లించడానికి నిర్ణయం తీసుకొని అమలుకై 'రెవెన్యూ రిసోర్స్ ఒబిలైజేషన్ కమిటీ' ఏర్పర్చి దాని ద్వారా నిధులు సేకరిస్తూ, సమస్య పరిష్కారానికి వచ్చే నెల 4వ తేదిన జరగబోయే క్యాబినెట్ సమావేశంలో స్పష్టమైన నిర్ణయానికి రానుందన్నారు.

ఇప్పటికైనా వంద రోజుల్లో రిటైర్డ్ ఎంప్లాయిస్ అన్ని బకాయిలను పూర్తి చేసి ఇచ్చిన మాట మీద కట్టుబడి ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్స్? వెంటనే ప్రభుత్వం నెరవేర్చి వారి బలిదానాలు నివారించాల్సి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కారేపల్లి పీఎస్‌లో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నిర్బంధం

ఖమ్మం, ఏప్రిల్ 24:బీఆర్ఎస్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని శుక్రవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఖమ్మం జిల్లా కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా నర్సంపేటలో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన నేపథ్యంలో పెద్ది సుదర్శన్ రెడ్డి ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశముందనే నెపంతో ఆయన అరెస్ట్ చేయగా అక్కడి ఏసీపీ రవీందర్ రెడ్డి స్వయంగా తన వాహనంలో నర్సంపేట నుండి నెక్కొండ, తొర్రురు, ఖమ్మం మీదుగా కారేపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి వెంట మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, దుగ్గొండి మండల పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి మేర్గు రాంబాబు ఉన్నారు. కాగా కారేపల్లి మండలం బీఆర్ఎస్ నాయకులు లకావత్ రాము, గంగరబోయిన మురళి, దుంకెన రవీందర్‌లతో పాటు పలువురు నాయకులు పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసుల అదుపులో ఉన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని కలిశారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడులు

ఖమ్మం, ఏప్రిల్ 24: పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం మెరుపుదాడులు చేశారు. దీనికి సంబంధించి టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం బూర్గంపహాడ్ మండలంలోని సారపాక పరిధిలోని జామాయిల్ తోటలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ జలకం ప్రవీణ్, సుమన్, సిబ్బందితో కలిసి రైడ్ చేయగా పేకాట ఆడుతున్న 11 మంది పట్టుబడగా ముగ్గురు వ్యక్తులు పరారైనట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి రూ.57,915 నగదు, రెండు ద్విచక్రవాహనాలు, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## ఒడిశా.. గజపతి జిల్లాలో ఇద్దరు విద్యార్థినులు చనిపోయారంటూ వచ్చిన వార్తాకథనాన్ని సుమోటోగా తీసుకున్న భారత ఎన్‌హెచ్ఆర్‌సీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24:ఒడిశా.. గజపతి జిల్లాలో ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇనుప గేటు ఈ నెల 15న విరిగి ఇద్దరు విద్యార్థినులపై పడడంతో, వారు మరణించారని ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తా కథనాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) స్వయంగా పరిశీలనకు స్వీకరించింది.

బడి ప్రవేశద్వారం దగ్గర బాలికలు ఆడుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు వార్తా కథనంలో పేర్కొన్నారు.

వార్తా కథనంలోని వివరాలు నిజమే అయిన పక్షంలో, బాధితుల మానవ హక్కుల విషయంలో తీవ్ర ఉల్లంఘన జరిగినట్లేనని కమిషన్ అభిప్రాయపడింది.

ఈ కారణంగా, గజపతి పోలీస్ సూపరింటెండెంటుకీ, ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ కమిషన్ నోటీసులను జారీ చేసి, దీనిపై రెండు వారాల లోపల సమగ్ర నివేదికను ఇవ్వాలని స్పష్టం చేసింది.

విద్యార్థినులు శిథిలాల కింద చిక్కుబడిపోయారనీ, స్థానికులు వెంటనే బాధితుల్ని దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకువెళ్లారనీ 2026 ఏప్రిల్ 16 నాటి మీడియా కథనం పేర్కొంది. అయితే, ఆ వైద్యులు ప్రకటించినట్లు ఆ వార్తా బాలికలు అప్పటికే చనిపోయారని కథనం తెలిపింది.

## దర్యాప్తులో పురోగతి, బాధితురాలికి పరిహారం (ఒకవేళ ఇస్తే) వివరాలను కూడా చెప్పాలన్న కమిషన్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 24:పారిపోయిందన్న ఆరోపణలపై, భర్తను భుజాలపై మోయిస్తూ గ్రామస్తులు ఓ మహిళను ఊరేగించినట్టు మీడియాలో వచ్చిన వార్తలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించింది.

2026 ఏప్రిల్ 13న మధ్యప్రదేశ్‌లోని ఝాబువా జిల్లాలో జరిగిన ఈ ఘటనను సుమోటోగా స్వీకరించింది. నివేదికల ప్రకారం.. గ్రామస్తులు ఆమెకు గుండు కూడా చేశారు. వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

మీడియాలో వచ్చిన వార్తలు నిజమైతే, బాధితుల మానవ హక్కుల తీవ్ర ఉల్లంఘన జరిగినట్టేనని కమిషన్ అభిప్రాయపడింది. ఈ మేరకు మధ్యప్రదేశ్‌లోని ఝాబువా జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు జారీ చేసింది.

ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. దర్యాప్తులో పురోగతితో, బాధితురాలికి పరిహారం (ఒకవేళ అందిస్తే) వంటి వివరాలు ఈ నివేదికలో ఉండాలని కమిషన్ పేర్కొన్నది.

2026 ఏప్రిల్ 15న వెలువడిన మీడియా కథనం ప్రకారం.. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. బాధితురాలిని గుర్తించి ఆమెకు రక్షణ కల్పించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోపాటు కొందరిని అరెస్టు కూడా చేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**